వార్త

ఆదివారం

5 జనవరి, 2025



# ఆర్థిక మహర్షి మన్మోహన్



## మహా 'కుంభ్'లో జనగంగ

## తారాతీరం

# 'భూత్ బంగ్లా'లో టబు

హీరో అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'భూత్ బంగ్లా'. వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, అస్రానీ ఇతర లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం టబును సంప్రదించారు. కథ నచ్చడంతో టబు కూడా ఓకే అన్నారు. ఇక 2000లో విడుదలైన హిందీ చిత్రం 'హేరా ఫేరి' తర్వాత హీరో అక్షయ్‌కుమార్, హీరోయిన్ టబు, దర్శకుడు ప్రియదర్శన్‌లు కలిసి చేస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. అంటే పదమూడు సంవత్సరాల తర్వాత ఈ ముగ్గురి కాంబినేషన్‌లో సినిమా కుదిరిందన్న మాట. 'భూత్ బంగ్లా' సినిమాను 2026 ఏప్రిల్ 2న విడుదల చేయాలని



# త్రివిక్రమ్‌తో బన్నీ మరో సినిమా

త్రివిక్రమ్‌తో మూడు సినిమాలు చేసిన బన్నీ సినిమాకి జరుగుతున్న సన్నాహాలు హీరోయిన్‌గా తెరపైకి మీనాక్షి చౌదరి పేరు రీసెంటుగా లక్కీ భాస్కర్‌తో హిట్ కొట్టిన బ్యూటీ అల్లు అర్జున్ త్రివిక్రమ్ కాంబినేషన్లో మరో ప్రాజెక్టు సెట్స్ పైకి వెళ్లనుందనే టాక్ చాలా రోజులుగా వినిపిస్తోంది. అందుకు సంబంధించిన సన్నాహాలు చకచకా జరిగిపోతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఈ ఇద్దరి కాంబినేషన్లో జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో సినిమాలు వచ్చాయి. ఈ మూడు కూడా భారీ విజయాలను నమోదు చేశాయి. ఈ మూడు సినిమాలు త్రివిక్రమ్ కెరియర్లో చెప్పుకోదగినవే. బన్నీకి ఫ్యామిలీ ఆడియన్సులో మరింత ఫాలోయింగ్ పెంచినవే. అలాంటి ఈ ఇద్దరి కాంబినేషన్లో మరో సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది. ఈ సినిమాలో కథానాయికగా ముందుగా పూజ హెగ్డే పేరు వినిపించింది. అల వైకుంఠపురములో కాంబినేషన్ రిపీట్ కానుందనే టాక్ వచ్చింది. కానీ ఇప్పుడు మీనాక్షి చౌదరి పేరు తెరపైకి వచ్చింది. ఆరంభంలో మీనాక్షి చౌదరికి చెప్పుకోదగిన సినిమాలు పడకపోయినా, ఆ తరువాత విజయ్, మహేశ్‌బాబు, దుల్కర్ సల్మాన్ వంటి స్టార్ హీరోలతో చేస్తూ వెళ్లింది. లక్కీ భాస్కర్ సక్సెస్‌ను అందించింది. వెంకటేశ్‌తో ఆమె చేసిన సంక్రాంతికి వస్తున్నాం జనవరిలో విడుదల కానుంది. నేపథ్యంలో తమ సినిమాలో త్రివిక్రమ్ ఆమెను ఎంపిక చేసినట్టుగా తెలుస్తోంది.



5, జనవరి 2025

## మంచి ముత్యాలు

ఆలోచనలే మనిషిని సరైన దిశలోకి మళ్లించి కార్యోన్ముఖుడ్ని చేస్తాయి. అందుకే ప్రతివారికి ఆలోచన అంత ముఖ్యం.

\- భగవద్గీత

## కదంబం


సంఘీ'భావం....5

చర్చకు అవకాశం లేని చట్టసభల సమావేశాలు

కవర్ స్టోరీ

ఆర్థిక మహర్షి.. 6

మహా 'కుంభ్'లో జనగంగ...9

ఈవారం కవిత్వం...12

సలాం సైనికా

'సెల్' వలలో బాల్యం 14

కథ..20

సాఫ్ట్‌వేర్ అమ్మాయి

సాహిత్యం...23

తెలుగు సాహిత్యంలో వేమన

వన్య ప్రాణుల సంరక్షణ.. 26

భవితకు బాటలు వేయాలి.. 28

ఇంకా...

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## బిపి అదుపులో ఉండాలంటే..

బిపిని అదుపులో ఉంచుకోవాలంటున్నారా.. అయితే ఓ ఐదు నిమిషాలు వెచ్చిస్తే చాలంటున్నాయి కొన్ని పరిశోధనలు. ఈ పరిశోధనలు మన రోజువారీ కార్యకలాపాలని నిద్ర, కూర్చునే ఉండడం, మెల్లగా నడవడం, వేగంగా నడవడం, నిల్చునే ఉండిపోవడం, వ్యాయామం ఇలా ఆరు రకాలుగా విభజించారు. ఒక రోజులో సగటున ఏడు గంటల్ని నిద్రకు వదిలేస్తే, పది గంటలు కూర్చునే ఉంటామనీ, 10 నిమిషాలు మెల్లగా నడుస్తూ ఉంటామనీ, ఐదు నిమిషాలు వేగంగా నడుస్తామనీ, పది నిమిషాలు నిల్చుని ఉంటామనీ విశ్లేషించారు. వీటిల్లో కూర్చునే ఉన్నప్పుడు ఓ పది



నిమిషాలు మెల్లగా నడవడం నుంచి, ఓ ఐదు నిమిషాలు నిల్చునే ఉండడం నుంచి తీసుకుని ఆ సమయంలో చిన్నపాటి వ్యాయామం చేస్తే రక్తపోటు గణనీయంగా తగ్గుతుందని చెబుతున్నారు. ఉదాహరణకి మెల్లగా నడుస్తున్నారనుకోండి వేగం పెంచి కనీసం మరో ఐదు నిమిషాలైనా నడవాలి. కూర్చునో, నిల్చునో ఉండాల్సి వచ్చిందనుకోండి ఓ పది నిమిషాలు మెట్లెక్కి దిగడమో, స్కిప్పింగో చేయాలి. అంతే కాకుండా రోజులో ఐదు నిమిషాలు వేగంగా నడుస్తారనుకోండి దాన్ని పది నిమిషాలు చేయాలట. రోజులో కొన్ని నిమిషాలు వ్యాయామానికి కేటాయిస్తుంటే దాన్ని మరో ఐదు నిమిషాలకి పెంచాలట. ఇలా చేస్తే రక్తపోటు అదుపులోకి వస్తుందంటున్నాయి పరిశోధనలు.


మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# పుష్ప విలాసం!

హిమాలయాల్లోని సుందర ప్రకృతి దృశ్యాల మధ్య ఉండే కొన్ని పుష్పాలు మనల్ని పలకరిస్తుంటాయి. తిరిగి వాటివైపు పరకాయిస్తే సృష్టిలోని అనేక జీవులను పోలిన ఆకృతితో ఆప్యాయంగా మనల్ని ఆకర్షిస్తాయి. అలాంటి వాటిలో కొన్నిటిని ఇక్కడ చూద్దాం.


















'సంఘీ' భావం



# చర్చకు అవకాశం లేని చట్టసభల సమావేశాలు

అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలు చర్చకు వస్తే అవి పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుంది. చట్టసభలకు విశేష అధికారాలు ఉంటాయి. ఎంతటి జటిలమైన సమస్య అయినా చట్టసభల సమావేశాల్లో వాటిని ప్రవేశపెట్టి ఆమోదం పొందుతారు. ఒకవేళ ఈ బిల్లులో ఏదైనా లోపాలు ఉంటే ప్రతిపక్షాలు వాటిని సభాదృష్టికి తీసుకువస్తాయి. అవసరమైతే ఓటింగ్ కూడా నిర్వహిస్తారు. ఇలాంటి చర్చలవల్ల బిల్లులు ఏకపక్షం కాకుండా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయి. చట్టసభల్లో చర్చ ఉంటుంది కాబట్టి అధికారపార్టీ ఈ బిల్లుల రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. ఒకసారి చట్టసభల్లోబిల్లుకు ఆమోదం లభిస్తే దానిని చట్టపరంగా అమలు చేసే అవకాశం ఉంటుంది. ప్రతి పార్లమెంటు సమావేశాల్లో, అసెంబ్లీ సమావేశాల్లో కనీసం 10 నుంచి 15 వరకు బిల్లులను ప్రవేశపెడతారు. కొన్ని అంశాలపై సవరణలు తీసుకువస్తారు. ఇలాంటి బిల్లులు సమావేశంలో కీలకంగా ఉంటాయి కాబట్టి దీనిపైచర్చ తప్పనిసరిగా ఉండాలి. లేకపోతే ఆ బిల్లులు అమలు చేసేసమయంలో కొన్ని సందర్భాల్లో ప్రజలు ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. అయితే ఇటీవల అటు పార్లమెంటు, ఇటు అసెంబ్లీ సమావేశాలతీరు పరిశీలిస్తే చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు ప్రజలశ్రేయస్సు కంటే వ్యక్తిగత, పార్టీ రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమపథకాలు, అభివృద్ధి పథకాల్లో లోపాలను చట్టసభల్లో ప్రతిపక్షాలు చర్చకు తీసుకురావడం ద్వారా వాటినిచక్కదిద్ది మరింత ప్రజోపయోగంగా తీర్చిదిద్దే అవకాశం కలుగుతుంది. ఇటీవల తాజాగా జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాల తీరు ఏమాత్రం ప్రజలకు ఉపయోగకరంగా ఉండటం లేదు. ఇటు ప్రతిపక్షాలు, అటు అధికారపార్టీ పోటీలు పడుతూ రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తు న్నారు. సమాజానికి ఏమాత్రం పనికిరాని అంశాలను భుజాలపైవేసుకుని ఉద్యమాలు నిర్వహించడం, సభలోగందరగోళ వాతావరణం సృష్టిస్తున్నారు. అధికారపార్టీ అమలుచేస్తున్న కొన్ని పథకాల్లో లోపాలు ఉండటం సహజం. వాటిని ప్రభుత్వందృష్టికి తీసుకువెళ్లి సరిదిద్దేలా ప్రయత్నం చేయాల్సిన బాధ్యత ముఖ్యంగా ప్రతిపక్షంపై ఉంటుంది. అసెంబ్లీ, పార్లమెంటులో ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అనేక మార్గాలు ఉంటాయి. నిబంధనల ప్రకారం ప్రతి అంశాన్ని కూలంకషంగా చర్చించడానికి వీలుగా ఈ మార్గాలను ప్రవేశపెట్టారు.జీరో అవర్, క్వశ్చన్ అవర్, చర్చలద్వారా వీటిని ప్రస్తావించే అవకాశం ఉంటుంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తాము అమలుచేస్తున్న విధానాలకుఅడ్డులేకుండా చూసుకోవాలని ప్రయత్నిస్తాయి. అందులో లోపాలు ప్రజల దృష్టికివెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాయి. ఇలాంటి లోపాలను అసెంబ్లీ, పార్ల మెంటు సమావేశాల్లో చర్చకు తీసుకువచ్చి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించే అవకాశం ప్రతిపక్ష పార్టీలకు ఉంటుంది. ప్రభుత్వాలకు కూడా తాము అమలుచేస్తున్నవిధానాలపై ఆత్మవిమర్శ చేసుకునే పరిస్థితి వస్తుంది. గతంలో అనేక సందర్భాల్లో చట్టసభల్లో చర్చ జరిగిన తరువాత పథకాల అమలులో మార్పులుచేయడం, కొత్త పథకాల అమలులో కొన్నిఅంశాలను కల్పించడం వంటివి జరిగాయి. అయితే ఇప్పుడు పరిస్థితిపూర్తిగా మారిపోయింది. సాధారణంగా అసెంబ్లీలో సుదీర్ఘచర్చలు జరగడం అధికారపార్టీకి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురౌతాయి. సుమారు రెండు, మూడు దశాబ్దాల క్రితం అధికారపార్టీ ఎత్తుగడలను ఎదుర్కొని ప్రతిపక్షం అనేక అంశాలపై సుధీర్ఘ చర్చను కొనసాగించేవారు. అయితే ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. ప్రతిపక్షాలే హంగామా చేయడం, తరచూ వాకౌట్లు చేయడం ద్వారా చర్చకు అవకాశంలేకుండా చేస్తున్నాయి. ఇలాంటి చర్యలు పరోక్షంగా అధికారపార్టీ చేసే తప్పులను సమర్థించినట్లే అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో దురదృష్టమేమిటంటే ప్రతిపక్షనేతలు సభలకు అసలు హాజరుకావడం లేదు. తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు అసెంబ్లీకి రావడానికి ఇష్టపడటం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభలకు హాజరుకావడం లేదు. ప్రతిపక్షాలు లేని అసెంబ్లీ సమావేశాల వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. అధికార పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎంతో ఉపయోగకర మైనవని అధికార పార్టీ సభల్లో ప్రకటించి తమ సభ్యులతో అభి నందనలు చేయించుకుని సంతృప్తిచెందుతుంది. గత కొంతకాలంగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలు పరిశీలిస్తే అధికార పార్టీ బహిరంగ సభలా కొనసాగుతున్నాయన్న అనుమానం కలుగుతుంది. అసెంబ్లీ బయట చేయాల్సిన రాజకీయాలను సమావేశాల లోపల చేయడానికి ప్రయత్నిస్తున్నారు. నిరసన ఉద్యమాలు సభ బయట, నిరసన గళంసభలో వినిపించాల్సి న బాధ్యతను ప్రతిపక్షాలు మరిచిపోతున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైతే చాలు ప్రతిరోజు ఒక సమస్యపై ఉద్యమం చేయడం, వెల్‌లోకి దూసుకువెళ్లడం, తమ స్థానాల్లో కూర్చోకుండా నినాదాలు చేసి సస్పెండ్ కావడమో, లేక వాకౌట్ చేసి ఇళ్లకు వెళ్లిపోవడమో చేస్తున్నారు. వీరు వెళ్లిపోయిన తరువాత అధికారపార్టీ తమకు తోచిన బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదింపచేసుకుంటున్నారు. ప్రశ్నించేవారు లేకపోవడంతో మంత్రులు తమ శాఖలపై పట్టు సాధించలేకపోతున్నారు. గతంలో ప్రతిపక్షాలు శాఖాపరమైన అంశాలను లోతుగా అధ్యయనం చేసి ప్రశ్నించే వారు. ఈ ప్రశ్నలకు సమర్థవంతమైన సమాధానం ఇవ్వాలంటే మంత్రులు తమ శాఖలలో జరుగుతున్న అంశాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలి. ప్రతిపక్షాల ఉద్యమాలతో చర్చ ఉండటం లేదు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# ఆర్థిక మహర్షి మన్మోహన్

కవర్ స్టోరీ

ఎ.వి.వి.ప్రసాద్
అసోసియేట్ ఎడిటర్, వార్త

**అది 1991...**

దేశం అప్పటికే చాలా క్లిష్ట పరిస్థితిలోకి జారిపోయింది. దాదాపు 100 కోట్ల సభ్యులున్న అతిపెద్ద భారత కుటుంబం. 'దేహీ' అంటూ రోడ్డున పడే గడ్డు పరిస్థితి వచ్చేసింది. సరిగ్గా ఆ సమయంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారు పి.వి. నరసింహారావు. ఆయనకు తోడుగా నిలిచారు డా. మన్మోహన్ సింగ్. అంతకుముందు చంద్రశేఖర్ ప్రభుత్వంలో దేశం ఎటువంటి సంక్షోభాన్నిఎదుర్కొన్నదో పి.వి. ప్రత్యక్షంగా చూశారు. ఇప్పుడు తానే ఆ 'కుర్చీలో' కూర్చున్నారు. ఏం చేయాలి? అనే ప్రశ్నార్థకంతోనే ఆయన పదవీ కాలం మొదలయింది. ఈ దేశాన్ని గట్టెక్కించడం ఎలా? బొటాబొటి సీట్లతో, తగినంత మెజారిటీ రాకపోయినా మిత్రపక్షాల 'మద్దతు'తో సంకీర్ణాన్ని ఏర్పాటు చేయగలిగారు కానీ దానిని సమర్థంగా ఎలా ముందుకు తీసుకువెళ్లాలో అర్థంకాని పరిస్థితి. అప్పుడు ఆయనకు కనిపించిన ఒకే ఒక వెలుగురేఖ డా.మన్మోహన్‌సింగ్. అసాధారణ రాజనీతిజ్ఞుడిగా పేరెన్నికగన్న పివికి ఎవరిని ఎందుకు ఎలా ఉపయోగించుకోవాలో బాగా తెలుసు. అలా, రాజకీయాలకు దూరంగా ఉంటున్న యుజిసి బాధ్యతలతో తలమునకలుగా ఉన్న మన్మోహన్ సింగ్‌ను దేశ ఆర్థిక మంత్రిగా నియమించడానికి ఎంతో ప్రయత్నించి సఫలమయ్యారు. పివిఐదేళ్ళ నిరాఘాటంగా సాగుతారనడానికి అప్పట్లో అది తొలి సంకేతం. అధికారంలోకి వచ్చేనాటికి స్థూల దేశీయ ఉత్పత్తి(జిడిపి) 3.3 శాతానికి క్షీణించి ఉంది. అలా ఉన్న ఆర్థిక వ్యవస్థను మన్మోహన్ చేతుల్లో పెట్టారు పి.వి. బాలకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తినట్లు మన్మోహన్ ఆర్థిక వ్యవస్థను తొలుత మరింత పడిపోకుండా పట్టుకున్నారు. అప్పటికే ఆయన చేయి తిరిగిన ఆర్థికవేత్త కావడంతో తలపై మహా భారం ఉన్నా దాని కింద తన భారతీయ కుటుంబమంతా పడి నలిగిపోకుండా ఆదుకున్నారు.

ఒక ప్రధానికి, ఒక ఆర్థిక మంత్రికి పదవి చేపట్టగానే ఇలాంటి భారం మీద పడితే.. సమర్థులు కాకపోతే పరిస్థితి ఏమిటి? పి.వి. సంపూర్ణ మద్దతుతో ఆయన ప్రారంభించిన సంస్కరణలు తర్వా ఐదేళ్లలో దేశాన్ని ఒక దారికి తెచ్చాయి. కొంత కాలం తర్వాత ఆయనే ప్రధాని కావడంతో పదేళ్లపాటు ఆర్థికరంగం పరుగులు పెట్టింది. జిడిపి 7.7 నుంచి 8.5 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న దంటే అది పూర్తిగా మన్మోహన్ చేతి చలువే అని చెప్పవచ్చు. మిగిలిన రాజకీయ అంశాలలో ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నా, పాలనాపరంగా ఎన్ని చిక్కుల్లోకి జారిపోయినా ఎత్తిన ఆర్థిక పర్వతాన్ని మాత్రం కిందకు దింపకుండా మన్మోహన్ నిలబెట్టగలిగారు. చరిత్రలో ఆయనను ఒక ప్రత్యేకమైన ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా నిలబెట్టేది ఆ విలక్షణమే. ఆయన ఒక యాదృచ్ఛిక(యాక్సిడెంటల్) ఆర్థిక మంత్రి, ప్రధాని అన్నది నిజమే అయినా ఆయనకు గల వైలక్షణ్యం మాత్రం అనితర సాధ్యమే అని చెప్పాలి. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రి అయ్యేనాటికి దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు 100 కోట్ల డాలర్లకు పడిపోయాయి. అంటే అత్యంత క్షీణ దశ అన్నమాట. ద్రవ్యోల్బణం డబుల్ డిజిట్‌కు చేరింది. విదేశీ రుణాలు హద్దులు దాటాయి. దిగుమతులకు అవసరమైన విదేశీ మారక నిల్వలు మూడు వారాలకు సరిపడేలా మాత్రమే ఉండడంతో తక్షణం ఏం చేయాలి? అనే ప్రశ్న పి.వి, మన్మోహన్‌లను కంటిపై కునుకు రాకుండా చేసింది. 'మీ మేధను ఉపయోగించండి. మీకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నాను' అని పివి భరోసా ఇవ్వడంతో చక చకా విధానాలు రూపొందించారు మన్మోహన్. అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులకు గిరాకీ పెరిగేందుకు రూపాయి విలువ తగ్గింపు, విదేశీ మారక నిల్వలు పెంచుకోడానికి బంగారం తాకట్టు. ఈ రెండు నిర్ణయాలు తొలుత భారత్‌ను ఆర్థికంగా గట్టెక్కించాయి. స్వపక్షంలోని మణిశంకర్ అయ్యర్, అర్జున్‌సింగ్ లు వ్యతిరేకించినా మన్మోహన్ పివి ఇచ్చిన దన్నుతో వెన్ను చూపకుండా ముందుకే కదిలారు. అదే వారి 'టర్మ్' పూర్తయ్యే సరికి మళ్లీ భారత్‌ను అనేక మెట్లు పైకి నడిపించింది.తర్వాత అనేక రాజకీయ పరిణామాలు దేశ పాలనా వ్యవస్థను మళ్లీ ఓ కుదుపు కుదిపాయి. 1996లో కాంగ్రెస్ ఓటమి అటు పార్టీ లోనూ, ఇటు దేశ రాజకీయాల్లోనూ చాలా మార్పులు తెచ్చింది. పి.వి., మన్మోహన్ చేసిన సంస్కరణలు ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదం చేసినా, రాజకీయంగా వారికి ఎదురు దెబ్బలు తగిలాయి. పార్టీలోని మార్పులే వారిని పక్కన పెట్టడానికి ప్రయత్నించడంతో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలి వాజ్‌పేయి నాయకత్వంలో బిజెపి అధికారంలోకి వచ్చింది. అయితే వాజ్‌పేయి తొలుత 13 రోజులు మించి పదవిలో కొనసాగలేకపోవడం, ఆ3 తర్వాత రకరకాల రాజకీయా సంక్షోభాలు, యునైటెడ్



ఫ్రంట్ ప్రభుత్వం పడిపోయిన తర్వాత 1998లో మళ్లీ బిజెపికి అధికారం, ఎన్‌డిఎ ప్రభుత్వం ఏరపడినా సంక్షోభాలు ఆగకపోవడం, ఆ తర్వాత 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ మన్మోహన్ నాయకత్వంలో యుపిఎ ప్రభుత్వం ఏర్పాటు కావడం వరకు చాలా చిత్ర విచిత్రమైన రాజకీయ పరిస్థితులను దేశం చవిచూసింది. అది కూడా అతుకుల బొంత వంటి సంకీర్ణం కావడం వల్ల దినదిన గండం నూరేళ్లాయుష్షుగానే పది సంవత్సరాల పాటు మన్మోహన్ పాలన సాగించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా, ఆర్థిక మంత్రిగా చేసిన అనుభవంతో ప్రధాని అయినా సొంత పార్టీ నుంచే ఆయన గట్టి పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. విభిన్న కారణాల వల్ల కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీ ప్రధాని పదవీని 'త్యాగం' చేయడంతో రెండవమారు కూడా ఆయనే ప్రధాని కావడం, తర్వాత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి పార్టీలో ప్రయత్నాలు జరిగినప్పుడు తాను అడ్డు పడకుండా 'పీఠం' దిగిపోవడానికి సిద్ధం కావడం వంటివన్నీ ఆయనలోని నిబద్ధతకు అద్దం పడతాయి.

ఆర్థిక మంత్రిగా సరళీకరణ విధానాలు చేపట్టి వ్యవస్థను గాడిన పెడితే ప్రధానిగా విదేశీ సంబంధాలను ఎంతో మెరుగుపరచి కీలక ఒప్పందాలకు కారణమయ్యారు మన్మోహన్ సింగ్. ఆయన అమలు చేసిన ఆర్థిక సంస్కరణల్లో ప్రధానంగా లైసెన్స్ రాజ్‌ను రద్దు చేయ డాన్ని చెప్పుకోవచ్చు. నాలుగు రంగాలు మినహా మిగిలిన వాటిలో పరిశ్రమల ఏర్పాటు విధానాన్ని సరళీకరించడంతో పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. దానివల్ల ఉత్పా దకత, ఉపాధిలో అనేక రెట్లు వృద్ధి కనిపించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు క్యూ కట్టడంతో వివిధ రంగాలలో అభివృద్ధి అనేక రెట్లు పెరిగింది. దేశంలో విదేశీ మారక నిల్వల వృద్ధి కూడా మరింత పెరిగి ఆయన ఆర్థిక మంత్రిగా టర్మ్ పూర్తయ్యేసరికి దేశం హాయిగా ఊపిరి పీల్చుకోగలిగింది. ఎల్‌పిజి సంస్కరణలతో నిరుద్యోగం కూడా తగ్గింది. మారక రేటులో దిద్దుబాటు జరిగి, భారత కరెన్సీ హెచ్చుతగ్గులు కూడా నియంత్రణలోకి వచ్చాయి. ఈ చర్యలతో 1991 నాటికి 100 కోట్ల డాలర్లు కూడా లేని విదేశీ మారక నిల్వలు 1995 నాటికి వెయ్యి కోట్ల డాలర్లకు పెరిగాయి. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఏం సాధించారో చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణలు ఇంకేం కావాలి!

ఇక తాను ప్రధాని కాగానే తొలుత దృష్టి సారించింది విదేశాంగ విధానంపై కావడం గమనించదగిన అంశం. ఆర్థిక మంత్రిగా జిడిపి వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకొన్న మన్మోహన్ ప్రధాని అయ్యాక విదేశాంగ విధానంలో కూడా చాలా సంస్కరణలు చేపట్టారు. దాని ఫలితాల్లో ప్రధానంగా చెప్పుకోవలసింది భారత్-అమెరికా మధ్య జరిగిన అణు ఒప్పందం. విదేశాంగ సంస్కరణల్లో భాగంగా అమెరికాతో ఆయన కుదుర్చుకున్న పౌర అణుఒప్పందం ప్రధానిగా ఆయన సాధించిన గొప్ప విజయంగా చెప్పవచ్చు. అణ్వాస్త్రపరంగా భారత్‌ను దశాబ్దాల పాటు ఏకాకిగా మిగిల్చిన ప్రపంచ దేశాలకు ఈ చరిత్రాత్మక



ఒప్పందంతో దీటుగా బదులిచ్చారు. అమెరికా నుంచి అణు ఇంధన లభ్యత, పౌర అణుసాంకేతికతలో సహకారం సహా ఎన్నో దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించే ఈ ఒప్పందం కార్యరూపం దాల్చడానికి మన్మోహన్ అవిశ్రాంతంగా కృషి చేశారు. నాటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ -2తో కలిసి మన్మోహన్ సింగ్ 2005 జులై 18న పౌరఅణు ఒప్పందానికి సంబంధించిన విధి విధానాలపై సంయుక్త ప్రకటన చేశారు. అయితే ఈ ఒప్పందాన్ని అప్పటి సంకీర్ణ ప్రభుత్వ మిత్ర పక్షమైన లెఫ్ట్‌పార్టీలు పూర్తిగా వ్యతిరేకించాయి. ప్రభుత్వం కుప్పకూలినా సరే, ముందుకు వెళ్లడం ఆపనన్న మన్మోహన్, తర్వాత విశ్వాస పరీక్ష ఎదుర్కొని ప్రభుత్వాన్ని నిలబెట్టుకోగలిగారు. ప్రధానిగా ఆయన ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లలో ఇది ఒకటి.



2008 అక్టోబర్‌లో అణు ఒప్పందం అమలులోకి వచ్చింది. పివి తనను ఏరికోరి ఆర్థిక మంత్రిగా ఎంపిక చేసుకున్నట్లే, మన్మోహన్ మరో ఆర్థిక నిపుణుడైన పి.చిదంబరానికి సంస్కరణ సారథ్య బాధ్యతలను అప్పగించారు. ఒక దశలో వృద్ధిరేటు 9 శాతాన్ని టచ్ చేసినట్లుగా కూడా వార్తలు

వచ్చాయి. ఆర్థిక మంత్రిగా ఎంత 'యాక్సిడెంటల్'గా పదవి లోకి వచ్చారో, ప్రధానిగా పదేళ్లపాటు కూడా అలాగే కొన సాగారు. ముఖ్యంగా రెండో టర్మ్‌లో ఆయన ఎదుర్కొన్న రాజకీయ ఒడిదుడుకుల తలనొప్పులు బహుశా మరే ఇతర ప్రధాని ఎదుర్కొని ఉండరేమో అనిపిస్తుంది. 2జి స్పెక్ట్రం, బొగ్గు, కామన్వెల్త్, ఆదర్శ్.. ఇలా అనేకనేక భారీ కుంభకోణాలు ఆయన ప్రభుత్వాన్ని కాకవికలం చేశాయి. ఎన్ని అవినీతి కుంభకోణాలు తెరపైకి వచ్చినా 'సంకీర్ణ ధర్మం' ఆయన చేతుల్ని కట్టేసిందని కూడా చెప్పాలి. పార్టీ అధిష్ఠానం నిర్ణయాలను తు.చ తప్పక అనుసరించాలనే నియమంతో ఉన్న ఆయన ఎన్నో సంక్షోభాలను 'మౌనం'గానే తిలకిస్తూ ఊరుకోవలసి వచ్చింది. ప్రభుత్వంలోని ఆయా శాఖ మంత్రులపై ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా ప్రధానిగా మన్మోహన్‌ను వేలెత్తి చూపినవారు లేకపోవడమే విశేషం. 2008 నాటి ముంబయి ఉగ్రదాడి, 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన, అన్నాహజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమం దేశాన్ని ఓ ఊపు ఊపినా మన్మోహన్‌ను ఎవరూ నిందించలేకపోవడం కూడా విశేషమేనని చెప్పాలి. దేశంలో మూడు కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.72 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత కూడా మన్మోహన్ ప్రభుత్వానికే దక్కుతుంది. రుణమాఫీపై ఆయన ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయం వల్లనే 2009లో యుపిఎ వరుసగా రెండోసారి అధికారంలోకి రాగలిగిందని పిస్తుంది. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని తర్వాత చాలా పార్టీలు రైతురుణమాఫీ హామీతో ఎన్నికలకు వెళ్లి అధికారంలోకి వచ్చాయి. మన్మోహన్ హయాంలోనే విదర్భ, బుందేల్‌ఖండ్ ప్రాంతాల్లో రైతు ఆత్మహత్యల నివారణ కోసం ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించడం గమనించదగిన మరో అంశం. ప్రస్తుత పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రాంతం గహ్ గ్రామం లో 1932 సెప్టెంబర్ 26న ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన మన్మోహన్ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి అంతర్జాతీయ కేంబ్రిడ్జి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీల నుంచి కూడా ప్రతిష్టాత్మక డాక్టరేట్లు అందుకున్నారు. ఆర్థిక శాస్త్రంలో లెక్చరర్‌గా మొదలైన ఆయన








వ్యక్తిగత జీవితం తర్వాత పంజాబ్ (భారత్), ఢిల్లీ విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్, 1966-69 మధ్య ఐక్యరాజ్యసమితి, ఆ తర్వాత వాణిజ్య, పరిశ్రమల శాఖలో ఆర్థిక సలహాదారు, అనంతరం కేంద్ర ఆర్థిక శాఖలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా పనిచేశారు. ఈ మెట్లన్నీ ఎక్కిన తర్వాత 1982లో అత్యంత కీలకమైన రిజర్వుబ్యాంకు గవర్నర్ కావడం ఒక పెద్ద మలుపు. ఆ తర్వాత అన్నీ కీలకమైన మలుపులే. రెండేళ్లు చేసిన ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్, తర్వాత యుజిసి చైర్మన్ వంటి పదవులన్నీ ఆయనను శిఖరాగ్రానికి చేర్చినవే. 33 సంవత్సరాల పాటు ఏకబిగిన రాజ్యసభ సభ్యునిగా కొనసాగడం కూడా ఆయన చరిత్రలో ఎన్నదగిన విశేషమే. ప్రపంచం 2008లో పెను ఆర్థిక సంక్షోభాన్ని చవి చూసినప్పుడు భారత్ మాత్రం తొణికిసలాడకుండా నిలబడిం దంటే అంతకుముందు ఆయన అనుసరించిన ఆర్థిక సంస్కరణలే, దౌత్యవిధానాలే కారణమని చెప్పవచ్చు. దేశానికి ఆయన చూపిన మార్గదర్శనమే అత్యున్నత పౌరపురస్కారమైన 'పద్మవిభూషణ్' అందుకకొనేట్లు చేసింది. తన ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ లేకపోయినా రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మన్మోహన్ ఆమోదముద్ర వేయించారు. అత్యంత వ్యూహాత్మకంగా తెలంగాణ బిల్లునూ ఉభయ సభల్లో గట్టెక్కించారు. తొలిసారి ఒక మహిళ (ప్రతిభాపాటిల్) రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించింది కూడా ఆయన హయాంలోనే. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య సేవలు మెరుగు పరచడానికి నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ప్రారంభించింది మన్మోహన్ ప్రభుత్వమే. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి సమాచారాన్ని తెలుసుకునే హక్కు సాధారణ పౌరునికీ ఉండాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టాన్ని ప్రజలకు అందించింది ఆయనే. ఇందిర, నరేంద్ర మోడీ మధ్య అంటే 1986-2014 మధ్య మూడు దశాబ్దాల కాలంలో ప్రధాన మంత్రి పదవిని చాలా మంది అధిష్టించినా చరిత్ర గతిని మార్చిన ప్రధానులుగా మిగిలేది మన్మోహన్,వాజ్‌పేయి అనే చెప్పాలి. 92యేళ్ల వార్ధక్యంలో తన సంస్కరణలన్నిటిని దేశానికే వదిలేసి డిసెంబరు 26న కన్నుమూసిన మన్మోహన్ భారతీయులకేగాక ప్రపంచ ప్రజలందరి హృదయాలలో చిరకాలం గుర్తుంటారు.



# మహా 'కుంభ్'లో జనగంగ

డా.దేవులపల్లి పద్మజ

పౌరాణిక ప్రాముఖ్యత గల కుంభం సముద్ర మథనానంతరం లభించిన అమృత భాండం ప్రధానంగా జరిగిన విషయం. ప్రతి పుష్కర కాలానికి ఒకసారి జరుపుకునే కుంభ మేళా మోక్షం కోసం, ఆధ్యాత్మిక అన్వేషణకు చిహ్నంగా హిందూ పురాణాలలో లోతైన ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ గొప్ప పండుగ నాలుగు పవిత్ర ప్రదేశాల మధ్య తిరుగుతుంది, ఈ సంవత్సరం ప్రయాగ్ రాజ్ కుంభాన్ని నిర్వహిస్తోంది. అతి పెద్ద, అత్యంత ముఖ్యమైన హిందూ సమావేశంగా పరిగణించబడుతుంది.

### కుంభ మేళా

హిందువుల సంప్రదాయ పరమైన ఉత్సవం. సాధారణ కుంభ మేళా ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. అర్ధ కుంభమేళా అనేది ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి హరిద్వార్ లేక ప్రయాగలలో జరుగుతుంది. పూర్ణ కుంభ మేళా అనేది ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌లలో జరుగుతుంది. వేద జ్యోతిష్యం ప్రకారం బృహస్పతి ఒక రాశిలో ఒక ఏడాదిపాటు నివాసం ఉంటాడు. పన్నెండు రాశుల మీదుగా ప్రయాణించటానికి పన్నెండు సంవత్సరాలు పడుతుంది. అందుకే పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పవిత్ర స్థలాలలో కుంభమేళా నిర్వ హించబడుతుంది. హిందూ గ్రంథాల ఆధారంగా భూలోకంలో ఒక ఏడాది దేవతలకు ఒక రోజుతో సమానం. దీని ప్రకారం సురులు, అసురుల మధ్య పన్నెండు సంవత్సరాల పాటు సమరం జరిగింది. ఆ కారణంగా పన్నెండు సంవత్సరాల కొకసారి భూలోకంలో ఈ మేళా జరుపుకుంటున్నాం.

సురులకు పన్నెండు సంవత్సరాలయితే, భూలోకంలో నూట నలుబది నాలుగు సంవత్సరాలకు సమానం. ఈ కారణంగా ఈ సమయంలో భూమిపై మహా కుంభమేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అమృతం కోసం జరిగిన పోరాటంలో చంద్రుడు అమృతాన్ని వృథా కాకుండా కాపాడాడు. గురువు అమృత కలశం జాగ్రత్త పరచాడు. సూర్యుడు కలశాన్ని భగ్నం

కాకుండా చూసాడు. శని భగవానుడు ఇంద్రుని కోపం నుండి రక్షించాడు. అందుకే ఈ గ్రహ సంచారం కలసిన ప్రతి సమయంలో మహాకుంభం నిర్వహించబడుతుంది. ఈ గ్రహాల కలయిక వేళలో అమృత పాత్ర రక్షించబడింది. ఆ తరువాత దేవతలందరూ మహావిష్ణువు సహాయంతో అమృతాన్ని సేవించారు. కనుకనే మహాకుంభమేళా సమయంలో చేసే స్నానానికి రాజస్నానం అని పిలుస్తారు. ఈ సమయంలో నదుల నీరు అమృతం తో కూడిన సమాన లక్షణాలను కలిగి ఉంటుందని హిందువుల నమ్మకం. సకల దేవతల అనుగ్రహం లభిస్తుం దని ప్రగాఢ నమ్మకం. ముఖ్యంగా ప్రయాగలో రాజ స్నానానికి మత పరమైన ప్రాముఖ్యత ఉంది. ఇక్కడ గంగా, యమున, సరస్వతి నదులు కలుస్తాయి. ఈ కారణంగా ఈ సంగమ స్నానం విశేషం. హిందూ పురాణాలను లోతుగా అధ్యయనం చేస్తే, శ్రీమహావిష్ణువు అమృత భాండాన్ని తీసుకొని వెళుతూ ప్రయాగ, హరిద్వార్, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని, నాసిక్‌లలో కొన్ని అమృత బిందువులని చిలకరించాడని తెలుస్తోంది. దీనిని గురించి భాగవత పురాణం, విష్ణు పురాణం, మహా భారతం, రామాయణాలలో కుంభ మేళాకు సంబంధించిన ప్రస్తావన గమనించగలరు. స్కాంద పురాణంలో పేర్కొన్నట్టుగా, అమృత కలశాన్ని ఎక్కడ ఉంచారో అక్కడే కుంభమేళా జరుపుకుంటారు. కానీ కలశాన్ని అణచి వేయడంతో పాటు అమృతం చిందించిన ప్రదేశంలో మాత్రమే జరుపుకుంటారు. ఈ అమృత బిందువులు ఎక్కడ చిలకరించ బడిందో ఆ ప్రదేశాలలో ఆధ్యాత్మిక శక్తులను ఇచ్చాయని నమ్ముతారు. పూర్ణకుంభమేళా ప్రతి పన్నెండు సంవత్సరాలకు నాలుగు ప్రధాన ప్రదేశాలలో జరిపే సంప్రదాయం ఎప్పటినుంచో వస్తోంది. అలహాబాద్ లోని ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని, నాశిక్ ప్రదేశాలలో గ్రహ కదలికల ఆధారంగా మహా కుంభ మేళాను 144 సంవత్సరాల తరువాత దీనిని 12 (పూర్ణ కుంభమేళా అంటారు) ప్రయాగలో జరుపుతారు. ఈ ఉత్సవం కుంభమేళాను 850 సంవత్సరం పూర్వం ఆదిశంకరాచార్య ప్రారంభించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. సాగర మథనం ప్రారంభమైనప్పటి నుంచి కుంభం నిర్వహించినట్లు చెబుతారు.

శంకరాచార్యులు, వారి శిష్యులు, సన్యాసులు, అఘోరాలకు సంగమం ఒడ్డున రాజ స్నానానికి ఏర్పాట్లు చేసారు. ఇక్కడ స్నానమాచరించడం వలన మోక్షం పొందవచ్చని నమ్మకం. ఈ కారణంగానే లక్షల సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఈ కారణంగా ఈ ప్రాంతాలలో కుంభమేళాలను నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాలలో నదీజలాలు ఎల్లకాలం పవిత్రంగా



ఉన్నప్పటికీ, గ్రహ గతుల రీత్యా ప్రత్యేకమైన తిథులలో ఆ జలాలు మరింత పవిత్రమౌతాయి. ఎక్కడైతే ఈ మేళా నిరహించడం జరుగుతుందో అక్కడ నదీ జలాలతో పవిత్ర స్నానం ఆచరించడం ¿ఈ పండుగ సందర్భంగా పాటించే అతి ముఖ్యమైన ఆచారం.

## హరిద్వార్

**పద్మినీ నాయకే మేషే కుంభరాశి గతే గురోః ।**
**గంగా ద్వారే భవేద్ యోగః**
**కుంభ నామ తథోత్తమాః ॥**

సూర్యుడు మేష రాశిలో ఉన్నప్పుడు హరిద్వార్‌లోని గంగానదిలో నిర్వహిస్తారు

## ఉజ్జయిని

**మేషరాశి గతే సూర్య సింహ**
**రాశౌ బృహస్పతౌ ।**
**ఉజ్జయిన్యాం**
**భవేత్ కుంభః సదాముక్తి**
**ప్రదాయకః ॥**

బృహస్పతి, సూర్యుడు వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు ఉజ్జయినిలోను నిర్వహించడం జరుగుతుంది.




## నాసిక్

**సింహరాశి గతే సూర్య సింహ రాశౌ బృహస్పతౌ।**
**గోదావర్యా భవేత్ కుంభోం జయతే ఖలు ముక్తిదః ॥**

సూర్యుడు, బృహస్పతి సింహ రాశిలో ఉన్నప్పుడు ఈ కుంభ మేళాను నాసిక్ లోని త్రయంబకేశ్వర్‌లో నిర్వహిస్తారు. రాముడు వనవాస సమయంలో నివసించిన దండకారణ్యంలో నాసిక్ ఒక భాగం. అందుకే నాసిక్ నందు కుంభమేళా నిర్వహిస్తారు.

## ప్రయాగ

**మేషరాశి గతే జీవే మకరే చంద్ర భాస్కరౌ ।**
**అమావాస్య తదా యోగః కుమ్భాగ్యస్తీర్థ నాయకే ॥**

బృహస్పతి వృషభ రాశిలో, సూర్యుడు మకర రాశిలో ఉన్నప్పుడు కుంభ మేళాను ప్రయాగలో నిర్వహిస్తారు. ప్రాచీన భారత వేదకాలం నుండే ఈ మేళాను నిర్వహించే ఆచారం ఉన్నట్లు హిందూ పురాణాల ద్వారా మనకు తెలుస్తుంది. మహాభారతంలోను, భాగవత పురాణంలోను, రామాయణంలోను కుంభ మేళాకు సంబంధించిన ప్రస్తావన కనిపిస్తుంది. ఈ ఉత్సవానికి దేశ, విదేశాలనుండి లక్షల సంఖ్యలో భక్తులు హాజరగుతారు. అంతే కాకుండా జనజీవన స్రవంతికి దూరంగా జీవించే సాధువులు, అఘోరాలు ఈ పవిత్ర స్నానాలను ఆచరించటానికి కదలివస్తారు. ప్రయాగ, హరిద్వార్ మరియు ఉజ్జయినీలలో కలిసి స్నానం చేసే వైష్ణవ అఖాడాలు, శైవ అఖాడాలు, నాసిక్‌లో మాత్రం విడివిడిగా స్నానం చేసే ఆచారం ఉంది. రాబోయే 2025వ సంవత్సరంలో ప్రయాగరాజ్ మహాకుంభమేళా ప్రారంభ దినం జనవరి 13 సోమవారం, పూర్ణిమ తిథిరోజు ఆరుద్ర నక్షత్రంలో ప్రవేశించి ఫిబ్రవరి 26, త్రయోదశి బుధవారం శ్రవణం నక్షత్రంలో పూర్తవుతుంది. ఈ ఉత్సవం పవిత్ర గంగా, గోదావరి, సరస్వతీ నదుల త్రివేణీ సంగమ ప్రదేశంలో జరుగుతుంది. ఈ ఉత్సవాన్ని అలహాబాద్ కుంభమేళా అని కూడా వ్యవహరిస్తారు.

**కుంభమేళా జరిగే 45 రోజులలో అతి ముఖ్యమైన రోజులు**

**జనవరి 13, 2025** పుష్యపూర్ణిమ
**జనవరి 14, 2025** మకర సంక్రాంతి
**జనవరి 29, 2025** మౌని అమావాస్య
**ఫిబ్రవరి 3, 2025** వసంత పంచమి
**ఫిబ్రవరి 12, 2025** మాఘ పూర్ణిమ
**ఫిబ్రవరి 26, 2025** మహా శివరాత్రి

ఈ ప్రత్యేక రోజుల్లో స్నానం చేస్తే మోక్షం సంప్రాప్తిస్తుందని విశ్వాసం. గత శతాబ్దాల చరిత్ర చూస్తే ముందు మాఘ మేళాగా పిలువబడిన మేళా అనంతర కాలంలో కుంభమేళాగా 1870 సంవత్సరంలో అలహాబాద్‌లో కుంభ మేళాగా వర్ణించబడిన తొలి షెడ్యూల్, బ్రిటిష్ నివేదిక విడుదలైంది. చరిత్రకారుడు కామా మక్లీన్ 1870 మేళా కుంభ మేళాగా జరిగిన ప్రథమ జాతర అని అభిప్రాయపడ్డారు. అలహాబాద్‌లోని ప్రయాగ వాల్ బ్రాహ్మణు లకు అత్యంత ప్రీతికరమైన సమయం. వృత్తిరీత్యా ఇది ఆదాయ వనరు. యాత్రికులపై భారీ స్థాయిలో మతపరమైన పన్ను విధించటం ద్వారా మేళా నుండి లాభం పొందేందుకు బ్రిటిషువారు చేసిన ప్రయత్నాలు కంపెనీని ప్రయాగ్ వాల్‌లతో ప్రత్యక్ష సంఘర్షణలోనికి తెచ్చాయి. గతంలో 1940లో కంపెనీ యాత్రికుల పన్నును రద్దు చేసిన తరువాత కూడా, మేళాలో వర్తకులు, సర్వీస్ ప్రొవైడర్‌లపై పన్ను విధించటం కొనసాగించింది. ప్రయాగ్‌లోని కుంభమేళా గురించిన మొదటి బ్రిటిష్ ప్రస్తావన నివేదికలో మాత్రమే ఉంది. ఇది జనవరి 1870లో జరిగిన కూంబ్ ఫైర్‌లో తీర్థయాత్ర, పారిశుద్ధ్య నియంత్రణలను





పెంచాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. మక్లీన్ ప్రకారం ప్రయాగ్ వాల్ సహకరించారు. కుంభ పురాణం, బ్రాన్డ్ హరిద్వార్ నుండి పురాతన వార్షిక ప్రయాగ మాఘ మేళా వరకు సామాజిక, రాజకీయ పరంగా అందించబడింది. 19వ శతాబ్దంలో పరిస్థితులు ఇవి. ఆ రోజులలో యాత్రికుల స్నానపు పన్ను చేపట్టింది. మేళాలో స్నానం చేయాలనుకునే వారికి రూ.1 పన్ను విధించింది. వెల్ష్‌ట్రావెల్ రైటర్ ప్రకారం, పన్ను చాలా తీవ్రంగా ఉండేది. ఆ రోజుల లో ఒక మనిషికి ఒక నెల సుఖంగా జీవించటానికి రూ.1 సరిపోయేది. మరొక సమకాలీన మూలం ప్రకారం కంపెనీ విధించిన పన్నును మూడు రూపా యలుగా మార్చింది. నది ఒడ్డున పితృకార్యాలు నిర్వహించే బ్రాహ్మణులకు దానధర్మాలు, బహుమతులలో ఎక్కువ ఖర్చు పెడతారని అప్పటి ప్రభుత్వం అభిప్రాయపడింది. 1908లో అలహాబాదులో స్నానం చేయాలకునే స్థానిక సైనికులకు యాత్రికుల పన్నులను రద్దు చేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ చర్య బ్రిటీష్ ప్రభుత్వం పట్ల వారి విధేయతను బలోపేతం చేయటానికి ఉద్దేశించబడినది. 1833లో రేవా యువరాజు బిషూనాథ్ సింగ్ స్నానం చెయ్యలేదనే కారణంతో పన్ను చెల్లించటానికి నిరాకరించాడు. అయితే, స్థానికి బ్రిటిష్ కలెక్టర్ రేవాకు రూ.5490 పన్ను బిల్లును పంపాడు. అతను ప్రయాగ్ వాల్‌లను నియమించుకున్నాడు. 1836లో రేవారాజు తన ఐదువేల మంది సభ్యులకు పన్ను మినహా యింపు ఇవ్వాలని రాజస్నానం చేయుటకు అనుమతి ఇవ్వవలసి నదిగా బ్రిటిష్ వారిని అభ్యర్థిం చాడు. బ్రిటిష్‌వారు వేయి మందికి మాత్రమే మినహాయింపు కలిగించారు. కోపంతో రాజు తన అలహాబాద్ కుంభమేళా పర్యటనను విరమించుకున్నాడు. అనంతరం 1840లో బ్రిటిష్ వారు యాత్రికుల పన్నులను రద్దుచేసారు. ఈ అసంతృప్త కాలంలో ప్రభుత్వం ప్రజాదరణను పొందటానికి వేసిన ఎత్తుగడ. ఆ సంవత్సరం మాఘ మేళాకు భారీ సంఖ్యలో యాత్రికులు హాజరైనారు. తొక్కిసలాట జరిగి గాయాలు తగిలి కొందరు, మరణించి కొందరు దుర్ఘటనకు పాలైనారు. ఈ మేళా సమయంలో హరిద్వార్‌లో భారీగా జరిగే వ్యాపారాలు ప్రయాగలో కొంచెం తక్కువ స్థాయిలో వుండేవి. ఐరోపా యాత్రికుడు జేమ్స్ డేవిడ్ సన్ ఈ ఉత్సవాన్ని రెండు





సార్లు సందర్శించారు. అతని పుస్తకం డైరీ ఆఫ్ ట్రావెల్స్ అండ్ ఎడ్వన్చర్స్ ఇన్ అప్పర్ ఇండియా (1843లో)లో వివరించాడు. అతని అభిప్రాయం ప్రకారం మేళాలో ఉంచిన వస్తువులన్నీ సాధారణంగా అన్ని భారతీయ జాతరలలో కనిపించే అమ్మకాలే. 1941లో జనవరి 4న ప్రభుత్వం అలహాబాదుకు వెళ్ళేందుకు ఉద్దేశించిన టిక్కెట్ల విక్రయాన్ని నిషేధించింది. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ప్రవేశించిన కారణంగా హాజరైనవారి సంఖ్యను అదుపు చేయాలని ప్రభుత్వం కోరింది. అలహాబాదుకు జపాను బాంబు దాడి చేయబోతోందని పుకార్లు రావటమే దీనికి కారణం. అదే సంవత్సరంలో దారాగంజ్ ప్రాంతానికి చెందిన మహానిర్వాణి అఖారా మేళాలో హిందువులు హాజరు కాకుండా నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరింది. మేళాలో గ్యాంబ్లింగ్ కార్నివాల్‌కు అధికారిక అనుమతులు మంజూరు చేయటంపై కూడా అఖారా అసంతృప్తి వ్యక్తం చేసింది. చాలామంది కొత్తగా సంపన్నులైన గ్రామస్థులు మేళాకు ఒక గౌరవ సూచకంగా హాజరు కావటం ప్రారంభించారు. ప్రయాగ్‌వాల్‌ల రిజిస్టరునందు వారి రాబోయే తరాలను కూడా నమోదు చేసుకున్నారు. స్వాతంత్ర్యానంతరం 1954 ఫిబ్రవరి 3న జరిగిన కుంభ మేళా తొక్కిసలాట విషాదాన్ని మిగిల్చింది. ఆ సంవత్సరం దాదాపు 5 మిలియన్ల మంది యాత్రికులు ఈ ఉత్సవాన్ని సందర్శించారు. 2007లో జరిగిన అర్ధ కుంభమేళా 45 రోజుల వ్యవధిలో 70 మిలియన్లకు పైగా ప్రజలు కుంభమేళాను సందర్శించారు. 2013 ప్రయాగ రాజ్‌లో జరిగిన మహా కుంభమేళాను రెండు నెలల వ్యవధిలో 120 మిలియన్ల మంది యాత్రికులు సందర్శించారని అంచనా. అందులో ఫిబ్రవరి 10, 2013 మౌని అమావాస్య రోజున 30 మిలియన్ల మందితో సహా రాజ స్నానం చేసినట్లు నమోదైంది. ఈ యాత్రకు వెళ్ళే భక్తులు అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రభుత్వాలు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ, ప్రతీఒక్కరు తమ జాగ్రత్తను తామే వహించినట్లయితే ఈ యాత్రను విజయ వంతంగా నిర్వహించుకోవచ్చు.

విశేషంగా దేశవాసుల మధ్య ఐక్యత, ఆధ్యాత్మికపరమైన ప్రగతి, దేశ భక్తి, మానవత్వం పరస్పర అవగాహన, చైతన్య జీవన సరళి, వ్యాపార వ్యవహార మెళకువులు, స్నేహభావం ఇటువంటి భారీ ఉత్సవాల నిర్వహణ వలన లభించాలని ఆకాంక్ష.

# యశస్విని కావాలి

కన్నవారి మది "ఆనంద డోలికలూగే'
'
'సిరులొలికించే' మోము,
అరవిందములవంటి
కోమల హస్తాలు కలిగి,
ఆత్మీయ సౌగంధికలను అందించే
అంతఃసౌందర్యం ఆ జవ్వని సొంతం.

అపర "వాగ్దేవి" యైన
ఆమె రసనపై నర్తించే ప్రతి పలుకూ
మధువులొలికే వాగమృతమే,
ప్రతి అడుగూ ఆదర్శభరితమే.
మమతలు పంచే ఆమె లోచనాలు
వెన్నెల కాంతులు
కురిపిస్తూ,
అధరాలపై తారాడే
"చంద్రిక" లాంటి
దరహాసంతో భాసించే
సమధిక మనోజ్ఞ
శిరీషకుసుమపేశలి అయి
అనురాగ మధురిమలు అందించే
నెచ్చెలి జన్మదినం,
మంచికి కోవెల కట్టిన సుదినం.

సఖీ!
కమలబాంధవుని సుషమ
"నీ యశస్సు జగతిని భాసించాలంటూ"
ఆశించే మనసుల దీవెనలొంది
అందుకో ఉన్నత శిఖరాలు,



కొనియాడుచూ జైకొట్టగ కరాలు.

**- వేమూరి శ్రీనివాస్**

# సలాం.. సైనికా..

భార్య, బిడ్డలని వదిలి
బోర్డర్‌లో కాపలా కాస్తాం..
మాతృమూర్తి ప్రేమకు దూరమైనా..
మాతృభూమికి సేవకి దగ్గరవుతాం..
కన్నవాళ్ల గుర్తొస్తే కన్నీళ్ల కనురెప్పల
సరిహద్దులనైనా దాటుతాయేమో కానీ
హద్దు మీరి ఎవరైనా
సరిహద్దు దాటే ప్రయత్నం
చేస్తే
రక్తం చిందించైనా దేశాన్ని
కాపాడుతాం.



సరిహద్దుల వద్ద శత్రు
దేశాల
తుపాకుల తూటాలు
మా పైకి
దూసుకొస్తున్నా..
మేం వెన్ను చూపం,
వెనకడుగు వేయం..
తూటాలకి ఎదురెళ్లి
రొమ్ము చూపి
పోరాడుతాం..
గాయాలు మా దేహాలకే
కానీ
ఈ దేశానికి కానీయం.

సహచరులు ఒక్కొక్కరు
నేలకొరుగుతున్నా..
తూటాలు మా దేహాలని తాకుతున్నా..
మా శరీరం నుంచి రక్తం కారి ఏరులై
పారుతున్నా..
శత్రువుని అంతమొందించాకే
మేం అమరులమై.. భారతమాత
ఒడిలో..
హాయిగా నిదురపోతాం..

**- కోనేటి నరేష్**

# తెలుగుదారులు

తెలుగుదారి పట్టరా
వెలుగులు వెదజల్లరా
తెలుగుబాట నడవరా
కుసుమాలు పరచరా.

తెలుగుతోవ అనుసరించరా
తేనెచుక్కలు చల్లరా
తెలుగుపథము నిర్మించరా




సౌరభాలు వెదజల్లరా.

తెలుగుతెరువు చూపరా
తెలివితేటలు అందించరా
తెలుగుమార్గము సుందరము చేయరా
తోటివారలకు సంతసమునివ్వరా.

తెలుగురాస్తా చూపించరా
తేటదనాలు తెలుపరా
తెలుగుదోవ సరిచేయరా
కదాలు తొక్కించరా.

తెలుగుజాడ వెలిగించరా
వెన్నెలందు విహరింపజేయరా
తెలుగుతొవ్వ పయనించమనరా
తెలుగుతల్లి ఋణము తీర్చుకోమనరా.

**- గుండపల్లి రాజేంద్రప్రసాద్**

## సరదా రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
*sunmagvaargtha@gmail.com*

# దశాబ్దపు స్వప్నం నిజమైన వేళ..




వన్డే క్రికెట్‌లో భారత్ విశ్వ విజేతగా నిలిచినప్పుడు కపిల్‌దేవ్ ఆ టైటిల్ తీసుకుంటున్న సందర్భాన్ని టీవీలో చూస్తూ నేనూ ఇలాంటి టైటిల్‌తో మనదేశాన్ని విశ్వ విజేతగా చూడాలనుకున్నాడు ఒకుర్రాడు. 24 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం చేశాడు ఆ స్వప్నం కోసం. సచిన్‌గా సాధించి భారతరత్నగా స్ఫూర్తినిస్తున్నారు. తరం మారింది. ఆట మారిందంతే! అలాంటి కలే దశాబ్దం పైగా ప్రయాణం! ఆపుకోలేని కన్నీటి సాక్షిగా ప్రపంచం చూస్తుండగానే చదరంగంలో భారత్ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.గుకేశ్ మేధస్సుకు విశ్వ కిరీటం తలొంచింది. నేడు ప్రతిభారతీయుడి గుండె మేరా భారత్ మహాన్ అంటూ ప్రతిధ్వనిస్తున్న ఈవేళ గుకేశ్ విజయాన్ని అభినందిస్తూ అంటూ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా చేసిన ఈ కామెంట్‌కు నెటిజన్లు ఆసక్తిగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## తల్లిదండ్రుల త్యాగం విలువ

తెలుగు మూలాలున్న కుటుంబానికి చెందిన గుకేశ్ ప్రతిభను చిన్నప్పుడే గుర్తించిన తల్లిదండ్రులు నేటి విజయం కోసం తమ జీవితాలనే త్యాగం చేశారు. ఈ.ఎన్.టీ సర్జన్ అయిన తండ్రి విలువైన తన కెరీర్‌నే పక్కన పెట్టి తన కొడుకు ప్రయాణంలో పాలుపంచుకున్నారు. మైక్రో బయాలజిస్టు అయిన తల్లి సంపాదనతోనే కుటుంబం నెట్టుకొచ్చేవారు. కొన్ని సందర్భాల్లో టోర్నీలకు వెళ్ళడానికి నిధుల సేకరణ కూడా చేసేవారు. చాలా కష్టపడి విశ్వనాథన్ ఆనంద్ మార్గదర్శనం తన కొడుకుకు దొరికేలా చేశారు. ఇక అప్పటి నుంచీ ఆనంద్ పర్యవేక్షణలో గుకేశ్ తనదైన శైలిలో నేటి తరపు కుర్రాడిలా చెస్ ఆటలో ప్రత్యర్థులకు చెమటలు పట్టించే విధంగా దూసుకుపోతున్నారు. 14రౌండ్స్ వున్న ఫైనల్ మ్యాచ్‌లో తొలి రౌండ్ లోనే ఓటమి చెంది కాస్త భావోద్వేగానికి గురైనా, వెంటనే కోలుకున్నాడు. 13వ రౌండ్ ముగిసిన సమయానికి 6.56.5తో సమంగా నిలిచినప్పటికీ, చివరి రౌండ్లో నల్లపావులతో ఆడినప్పటికీ తన ప్రత్యర్థి డింగ్ లిరెన్ అనుభవాన్ని సైతం అధిగమించి చిరస్మరణీయమైన విజయాన్ని మనకు అందించాడు. నలుపు తెలుపు గడీల మధ్య చురుకుగా కదులుతూ కాసేపు కళ్ళు మూస్తూ, తెరుస్తూ ఆట ప్రారంభంలోనే దూకుడుగా పావులనుకదుపుతూ తనవ్యూహాలతో ప్రత్యర్థి ఆటగాళ్ళకు అందకుండా వెళ్ళడం గుకేశ్ ఆటలోని ప్రత్యేకత అంటూ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మనలో వున్న గుకేశ్ బయటకు రావాలి

కేవలం 18 యేళ్ల వయస్సులో చదరంగం లాంటి ఆటలో ప్రపంచ చాంపియన్‌గా ఎదిగిన గుకేశ్, ఆ గెలుపు లో కీలకపాత్ర పోషించిన వారి తల్లిదండ్రుల నుంచి నేటి యువతరం, తల్లిదండ్రులు చాలా నేర్చుకోవచ్చు. తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను పిల్లలపై గుడ్డిగా ఒత్తిడితో రుద్దకుండా, ర్యాంకులు, మార్కుల పేరుతో ఇబ్బంది పెట్టకుండా పిల్లల ప్రతిభ, శ్రద్ధాసక్తులు ఆధారంగా ప్రోత్సాహం అందించాలి. పిల్లల కలల్ని అందమైనా లక్ష్యాలుగా తీర్చిదిద్దాలి. నేటి యువతరం కూడా వయస్సు కేవలం ఒక నంబర్ అని గమనించాలి. చరిత్ర గమనిస్తే అనామకులు కూడా తమ అలుపెరగని ప్రయత్నాల పరంపర కొనసాగిస్తూ, అహర్నిశల శ్రమతో ముందుకెళ్తూ అనుభవజ్ఞులైన హేమాహేమీలపై సైతం అసాధారణ విజయాలు సాధించారు. నవతరానికి స్ఫూర్తి ప్రదాతలుగా మిగిలారు. నువ్వే ఓ అద్భుతం అన్న వివేకానంద సూక్తిని మనమంతా మన గుండె శబ్దంగా మార్చుకుంటే మనలోని కోహ్లి, శ్రీనివాస రామానుజన్, విక్రమ్ సారాభాయ్, ద్రౌపది ముర్ము, రాజమౌళి, రజనీకాంత్ వంటివారు మనరూపంలో కొత్త తరానికి మార్గదర్శకులుగా బయటికొస్తారు.



## నీ కలలన్నీ నిజమవుతాయి!

కానీ దానికి ముందు నువ్వు ఎన్నో సవాళ్ళను స్వీకరించాలి అంటారు అబ్దుల్ కలాం. 2013 చాంపియన్ షిప్ మ్యాచ్‌లో కార్ల్ సన్, ఆనంద్ ఆటను చూసి కలలుగన్న ఓ పిల్లాడు దశాబ్దం తర్వాత ఆనంద్, కార్ల్ సన్ తన ఆటను చూసేలా, మెచ్చుకునేలా ఎదగడమంటే ఓ అద్భుతమనే చెప్పొచ్చు. అసాధారణ విజయాలన్నీ ప్రపంచం చూడాలంటే అమావాస్య చీకటిలోనే కొత్త దారులు అన్వేషించాలి. అప్పుడే ఆ విజయాలు వెలుగు శబ్దాలై భవిష్యత్తు తరాలకు ప్రేరణ ఇస్తాయి. గుకేశ్ ఇంకా ఎన్నో గెలుపు మలుపులతో మన దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరుకుంటూ, వారి తల్లిదండ్రులకు సెల్యూట్ చేశారు.

**- ఫిజిక్స్ అరుణ్ కుమార్**

షేక్ అబ్దుల్ హకీం జానీ



# 'సెల్' వలలో బాల్యం

భగవంతుడు మనిషికిచ్చిన అమూల్యమైన వరం బాల్యం, బుడి బుడి అడుగుల పసిడి బాల్యం భవితకు బంగరు బాటలు వేస్తుంది. చాలామంది ప్రతిచోట జయాన్నే కోరుకుంటారు. అయితే బిడ్డల చేతిలో పరాజయం పొందాలని ఆకిస్తారు. ఇంత విశాల దృక్పథంతో పిల్లల్ని పెంచితే, భవిష్యత్తులో వారు బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు. భౌతికమైన తాపత్రయాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచుతూ జ్ఞానతృష్ణ వైపు పరుగులు తీయించాలి. అగ్గిపుల్లలో ప్రజ్వలన దాగి ఉన్నట్లు పిల్లల్లో సైతం అనంతమైన శక్తి నిగూఢంగా దాగి ఉందని వారికి స్పష్టంగా తెలియజెప్పవలసిన ఆవశ్యకత ఉంది. నేడు సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. అంతర్జాలం, స్మార్ట్ ఫోన్ రూపంలో ప్రపంచమే అరచేతిలో ఉందని గర్వంగా చెప్పుకుంటున్నాం. ఇప్పుడు ఆ స్మార్ట్ ఫోన్లో చిన్నారులను మొదలుకుని యువత వరకు అందరి జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి.

## బాల బాని 'సెల్'

నేడు సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా పెరిగిపోయింది. ఒకప్పుడు చందమామ రావే జాబిల్లి రావే అని అమ్మ గోరుముద్దలు తినిపించేది. నేడు ఏడాది చిన్నారి సైతం స్మార్ట్ ఫోన్లో పాటలు, కార్టూన్ చిత్రాలు చూపించకపోతే అన్నం కూడా తినడం లేదు. స్మార్ట్ ఫోన్ మాయాజాలంలో పడి అనేకమంది కంటి నిండా నిద్ర కూడా పోవడం లేదు. పెద్దవాళ్ళే దగ్గరుండి ప్రోత్సహిస్తున్నారు. 18 సంవత్సరాల లోపు వయసున్నవారు 60 శాతం పైబడి స్మార్ట్ఫోన్ మాయాజాలంలో పడిపోయారని సర్వేలు చెబుతున్నాయి. గేమ్స్, రీల్స్ గంటలకొద్దీ సమయాన్ని కేటాయిస్తూ మొబైల్కు బానిసలై మానసిక వ్యాధులకు గురౌతున్నారు. సెల్ఫోన్ గేమ్స్ పిచ్చిలో పడి పాఠశాలకు వెళ్ళమంటే పిల్లలు ఎదురు తిరుగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. స్మార్ట్ఫోన్లకు బానిసలు కావడం వల్ల మానసిక సమస్యలు వస్తున్నాయి. కొందరు పిల్లలు సైకోలుగా మారుతున్నారు. మందలిస్తే ఇంటి నుండి పారిపోతున్నారు. తమ చేతిలోని స్మార్ట్‌ఫోన్ లాక్కుంటే హత్య చేయడానికి కూడా వెనుకాడటం లేదు.

## యునెస్కో నివేదిక

స్మార్ట్ ఫోన్ వల్ల కలిగే చెడు ఫలితాలను యునెస్కో తన నివేదికలో తెలియజేసింది. పాఠశాలల్లో మొబైల్ను నిషేధించాలని యునెస్కో కుండబద్దలు కొట్టి మరీ తన నివేదికలో వెల్లడించింది.

స్మార్ట్‌ఫోన్ మాయలో పడి చాలా మంది పిల్లలు ఏకాగ్రతతో పాఠాలు వినడం లేదు. పక్కవారితో గిల్లికజ్జాలు పెట్టుకోవడం, గిచ్చడం, గిల్లడం వంటి పనులు చేస్తున్నారు. పిల్లల్లో చిరాకు, కోపం, అసహనం పెరిగిపోతున్నాయి. ఉపాధ్యాయులతో దురుసుగా ప్రవర్తించడం, ఏకాగ్రత లోపించడం, తల్లిదండ్రులను ఎదిరించడం, తోటి వారిని ర్యాగింగ్ చేయడం ఇత్యాదివి ఎక్కువయ్యాయి.

స్మార్ట్‌ఫోన్ల వాడకం వల్ల పిల్లల్లో సృజనాత్మక తగ్గిపోతోంది. యుక్తవయస్సు వచ్చిన పిల్లలు ఏం చూస్తున్నారు? ఏం చేస్తున్నారనే విషయాలపై పర్యవేక్షణ కొరవడింది.

సెల్‌కు బానిసలైనవారు నలుగురిలో కలవరు. ప్రతి చిన్న విషయానికి కుంగిపోవడం విచిత్రంగా ప్రవర్తించడంతో అనారోగ్యానికి గురౌతున్నారు. పిల్లలకు మతిమరుపు కూడా వస్తుంది. మెదడుపై చెడు ప్రభావం పడుతుంది. సెల్ ఫోన్లో వీడియో గేమ్స్ ఆడటానికి అలవాటు పడి శారీరక వ్యాయామానికి దూరమవుతున్నారు. పిల్లలు ఎక్కువసేపు సెల్ చూడటం వల్ల మెడనరాలు, కంటిచూపు దెబ్బతినే ప్రమాదం ఉంది. విదేశాల్లో సెల్‌కు బానిసలైన పిల్లలకు కౌన్సెలింగ్ చేసే వ్యాపార సంస్థలు ప్రారంభమయ్యాయి.

ఒక బృందం ఇంటికి వచ్చి సెల్ బానిసలైన పిల్లలను కౌన్సిలింగ్ చేసి ఏం ఆటలు ఆడాలి? సమయాన్ని ఎలా గడపాలి? ఇత్యాదివి నేర్పిస్తారు.



మన దేశంలో పంజాబ్‌లో తొలిసారిగా సెల్ బానిసలను రక్షించేందుకు ఒక కేంద్రాన్ని ప్రారంభించారు. అది చూసి పరిమిత రాష్ట్రాలలో ఇటువంటి కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రాలకు 12 సంవత్సరాలలోపు సెల్ ఫోన్‌కు బానిసలైన చిన్నారుల కేసులు వస్తున్నాయి.

పిల్లలు, యువత స్మార్ట్ ఫోన్లు వాడకపోతే వాటి అమ్మకాలు పడిపోతాయని కొన్ని నివేదికలు వెల్లడించాయి, పత్రికా ప్రకటనలు తగ్గిపోతాయి. ఇలా చెప్పుకుంటూ పోతే అదో పెద్ద గ్రంథమే అవుతుంది. పెద్దలే స్మార్ట్ఫోన్లకు బానిసలైనప్పుడు పిల్లలు దాన్ని ఎలా విడిచిపెడతారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన మార్గంలో ఉపయోగించుకోకపోతే పెను ప్రమాదాలు తప్పవనేది పరిశీలకుల ఆవేదన. సాధ్యమైనంత వరకు పిల్లల్ని స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఒకప్పుడు పిల్లలు నిద్రపోయేటప్పుడు అమ్మమ్మ, నాయనమ్మ ఎవరో ఒకరు నీతి కథలు చెప్పేవారు. బాల్యంలోనే పిల్లలకు నైతిక విలువల గురించి అవగాహన కలిగేది. పిల్లల చేత కథల పుస్తకాలు చదివించడం వల్ల వారిలో భాషాభివృద్ధి చెందుతుంది. సైన్స్ ల్యాబ్‌లో మైక్రోస్కోప్, భూతద్దాలు, ప్రయోగాలు చేసి చూపిస్తే శాస్త్ర జ్ఞానం పెరుగుతుంది. రంగు రంగు కాగితాలు పలు నమూనాలలో కత్తిరించడం, వాటితో పలు రంగుల పూలు తయారు చేయడం, కుట్లు, అల్లికలు మొదలైన చేతి పనులు నేర్పించడం వల్ల వారిలో కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆటలు ఆడించడం, పాటలు పాడించడంతో పాటు పాఠశాల ప్రాంగణంలోని మొక్కలకు నీళ్ళు పోయడం, పాఠశాల గదులతో పాటు పరిసరాలు శుభ్రంగా ఎలా ఉంచుకోవాలనే అవగాహనను కల్పించి పిల్లల్ని పర్యావరణ ప్రేమికులుగా తీర్చిదిద్దాలి. పర్యావరణాన్ని అశ్రద్ధ చేస్తే రాబోయే విపత్కర పరిస్థితులను పిల్లలకు తెలియజేయాలి. ముందుగా పెద్దలు స్మార్ట్ ఫోన్ వాడకం తగ్గించాలి. పిల్లలతో కొంత సమయం గడపాలి. సంగీతం, శారీరక వ్యాయామం కలిగించే క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ పట్ల పిల్లలకు మక్కువ పెంచాలి. అనారోగ్యం కలిగించే ఆహారం కాకుండా పౌష్టికాహారం పిల్లలు తిని, సమయానికి నిద్రపోయేలా చూడాలి. ప్రతిచోట ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి పిల్లలను చైతన్యపరచడం వల్ల వాళ్ళు భావిభారత ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని నిస్సందేహంగా చెప్పవచ్చు.



## లోపాలను సరిదిద్దాలి

బాలల విషయంలో అనేక లోపాలు జరుగుతున్నాయి. వాటిని సరిదిద్దవలసిన ఆవశ్యకత ఉంది. పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. పిల్లలకు ఉన్నత విద్యను, వైద్యాన్ని, మంచి పౌష్టికాహారాన్ని అందించాలి. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాలు, అంగన్వాడీలో పలు ధాన్యాల పిండి పంపిణీ చేస్తున్నారు. ఇది



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే మధ్యతరగతి, పేద విద్యార్థులకు చాలా ఉపయుక్తంగా ఉంటోంది. ఎన్ని పథకాలు అమలైనా ప్రపంచంలో పౌష్టికాహార లోపం గల పిల్లలు ఎక్కువ మంది భారతదేశం, బంగ్లాదేశ్, పాకిస్థాన్లో ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి. మనదేశంలో అప్పుడే పుట్టిన నవజాత శిశువుల్లో హానికరమైన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమోతున్నాయి. అయోడిన్ లోపంతో మెదడు దెబ్బతిన్న పిల్లలు లక్షల్లోనే ఉంటారు. ఐరన్ లోపం, విటమిన్ ఏ లోపం ఇత్యాదివన్నీ పిల్లల్లో కనిపిస్తున్నాయి. అనేకమంది పిల్లలకు సరైన తాగునీరు కూడా అందటం లేదు. నిరక్షరాస్యత నిర్మూలన కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారు. ఇంత అభివృద్ధిని సాధించినప్పటికీ పాఠశాలలకు వెళ్ళి చదువుకోని పిల్లల సంఖ్య లక్షల్లోనే ఉంది. ప్రతి పిల్లవాడు పాఠశాలకు వెళ్ళి విద్యాభ్యాసం చేసేలా చర్యలు తీసుకోవాలి.

ధనవంతుల బిడ్డలకు సైతం నవీనత మాయలో సరైన పౌష్టికాహారం లభించడం లేదు. పిజ్జాలు, బర్గర్లు, న్యూడిల్స్, పాస్తా, బేకరీ ఆహార పదార్థాలు, శరీరానికి ఎటువంటి మేలు చేయని అందమైన పొట్లాలలోని తినుబండారాలను తింటూ అనారోగ్యం పాలౌతున్నారు. ఆరోగ్య, ఆహార, వ్యాయామ స్పృహల పట్ల పిల్లలకు అవగాహన కలిగించాలి. పిల్లలు ప్రకృతి ప్రసాదించిన వరాలు, వారే మన జాతీయ సంపద. వాళ్ళే రేపటి ఆశలు, వారిలోని గొప్పతనాన్ని మనం గుర్తించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిద్దివలసిన అవసరం ఉంది.

కథ

# ఎలుక తెలివి



నరసింహపురం పొలిమేరలో ఒక కప్ప, ఒక ఎలుక కలుసుకున్నాయి. అవి స్నేహంగా ఉండాలని నిర్ణయించుకున్నాయి. కప్ప ఎలుకతో "ఓ ఎలుకా! మన ఇద్దరి శత్రువు పాము. కనుక మనం మన శత్రువు నుండి రక్షించుకోవాలి" అని అంది. అందుకు ఎలుక కూడా "నీకు ఒక శత్రువు అయితే నాకు ఇరువురు శత్రువులు. పిల్లిచేత కూడా నాకు ప్రమాదం పొంచి ఉంటుంది" అని అంది. అప్పుడు కప్ప "ఔను.. నీవన్నది నిజమే" అంది. అవి అలా మాట్లాడుకుంటూ ఉండగానే వాటికి ఎదురుగా వస్తున్న ఒక పాము కనిపించింది. వెంటనే అది గమనించిన ఎలుక "ఒక పాము ఇటే వస్తున్నది. నేను ఈ కన్నంలోకి ప్రవేశిస్తాను" అని అంది. అప్పుడు కప్ప "ఎలుకా! నేను కూడా వస్తాను" అని అంది. ఎలుక "వద్దు కప్పా! కనీసం నీవన్నా క్షేమంగా ఉండు. ఇదిగో ఈ రాయి కింద దాక్కో" అని అదొక రాయిని చూపించింది. సరేనంది కప్ప. ఇంతలో ఆ పాము అక్కడికి వచ్చి ఆ కన్నంలోకి తొంగి చూసింది. అది గమనించిన ఎలుక మరో దారిలో తప్పించుకొని పోయింది. ఆ కప్ప కూడా నెమ్మదిగా బండరాయి నుండి బయట పడి పాము నుండి తప్పించుకొని తిరిగి ఎలుకను కలుసుకొంది. అప్పుడు ఎలుక "ఓ కప్పా! మనం శత్రువు వచ్చినప్పుడు ఒక్కచోట ఉండకూడదు" అంది. ఔను "తెలిసింది" అంది కప్ప.

అవి అలా నడుస్తూ ఉండగానే వాటికి ఎదురుగా మరొక పాము కనిపించింది. అప్పుడు ఎలుక "అయ్యో కప్పా! మనకు వాటి చేతిలో చావు రాసిపెట్టినట్లుంది. ప్రమాదం మీద ప్రమాదం ముంచుకొని వస్తున్నాయి" అని అంది. దాంతో కప్ప భయపడి "నేను వెనుకకు వెళ్లిపోతాను" అని వెనుతిరిగింది. ఆ ఎలుక మాత్రం ధైర్యంతో ముందుకు వెళ్లాలనే నిశ్చయించుకొని ముందుకు కదిలింది.

ఇంతలో ముందుకు వెళుతున్న ఎలుకకు అనుకోకుండా దానికి ఎదురుగా దాని శత్రువైన ఒక పిల్లి కనిపించింది. "అయ్యో! నాకు ఒక్క శత్రువు కాదు. ఒకదాని వెనుక మరొకటి రెండు ఉన్నాయి. ఇక్కడ ముందు పిల్లి, దాని వెనుక పాము. సరే! నాకు ఎలాగూ చావు తప్పదు. అయినా పెద్దలు చెప్పినట్లు ధైర్యంగా ఉంటాను. ఇప్పుడు ఏదో ఒక ఉపాయం ఆలోచించాలి" అని అనుకొంది. తర్వాత అది పిల్లి వద్దకు "పిల్లి మామా! అదిగో! నా కొరకు పాము వస్తోంది" అని పాము వినేటట్లుగా అంది.

అది విన్న ఆ పిల్లి ఆ పామును చూసి కోపంతో దానిని అడ్డుకుంది. అది పాముతో పోట్లాడింది. ఇదే అదనుగా ఎలుక అక్కడినుండి ముందుకు పారిపోయింది.

పిల్లి, పాము తమ పోరాటం ఆపి ఎలుక కొరకు చూసి "మనం కొట్లాడి ప్రయోజనం లేదు. ఆ ఎలుక తెలివిగా ఎప్పుడో పారిపోయింది" అని అనుకొని అవి వెళ్ళిపోయాయి. తిరిగి వెళుతున్న కప్పకి ఎదురుగా మరొక పాము కనిపించేసరికి భయపడి గట్టిగా "కాపాడండీ! కాపాడండీ!" అని అరచింది. దాని అరుపులు చెట్టుపైన ఉన్న ఒక గద్ద విన్నది. ఆ గద్ద ఆ పామును చూసి వెంటనే దానిని నోటితో పట్టుకుని పైకి ఎగిరి వెళ్ళిపోయింది. కప్ప వెంటనే అక్కడ ఉన్న చెరువులో దూకింది. కొన్ని రోజుల తర్వాత ఎలుక కప్ప వద్దకు వచ్చి "ఓ కప్పా! ఆపదలు వస్తుంటాయి, పోతుంటాయి. మనం భయంతో వెనుతిరగకూడదు" అని హితోపదేశం చేసింది. అందుకు ఆ కప్ప సరేనంది.

**- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
ధర్మపురి



వార్త ఆదివారం

## బాలగేయం

### బోసినవ్వులు

ఇంద్రధనుస్సు వర్ణాలు
చంద్రవదన కిరణాలు
ఇలకు దిగిన అందాలు
మిల మిల మెరిసే
తారలు
స్వచ్ఛమైన మనస్సులు
మచ్చే లేని యశస్సులు
బోసినవ్వుల ముత్యాలు
ముసిముసి నగవుల
సత్యాలు
విరిసీ విరియని
పువ్వులు
సిరిసిరి మువ్వల
నవ్వులు
చిరునవ్వుల చేమంతులు
మురిపించే
ముద్దబంతులు
ముద్దొచ్చే తొలి పొద్దులు
హద్దేలేని ఆనందాలు
ఇంటికి వెలుగు
పసిపిల్లలు
కంటికి జిలుగు
పసికూనలు

**-గుండాల నరేంద్రబాబు,**
తిరుపతి



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు



**-సి.కార్తి,** తిరుత్తణి

**ప్రశ్న: వాతావరణం వలన కలిగే అతి ముఖ్యమైన ప్రయోజనం ఏమిటి?**

**జవాబు:** భూమండలం మీద జీవకోటిని రక్షిస్తున్నది వాతావరణమే. సూర్యకిరణాల వేడిమికి జీవరాశి నశించకుండా వాతావరణం రక్షిస్తుంది. సూర్యుడు అస్తమించగానే భూమి మీద వేడి తగ్గిపోకుండా వాతావరణం అడ్డగిస్తుంది. వాతావరణం వేడిమిని అడ్డగించని పక్షంలో సూర్యాస్తమనం కాగానే విపరీతమైన శీతలం భూమండలాన్ని ఆవరించే అవకాశం ఉంది. ఇక, నష్టలంటారా? మనం కోరి తెచ్చుకున్నవేగానీ, ప్రకృతిరీత్యా వాతావరణం జీవరాశికి మేలు చేకూర్చేదే. ఈ వాతావరణం ద్వారానే గాలులు నిరంతరం కదులుతూ వుంటాయి. గాలులను కలుషితం చేసిన ఘనత మానవాళిదే!

**- ఎస్.ఆశ్లేష,** తణుకు

**ప్రశ్న: హామ్ రేడియో అంటుంటారు. హామ్ అంటే?**

**జవాబు:** ప్రపంచంలో హామ్ రేడియో వ్యవస్థ 18వ శతాబ్దంలోనే బీజాలు పడినా, 1923లోనే సమగ్రంగా రూపొందింది. దీనిని ఎమెచ్యూర్ రేడియోగానే వ్యవహరించేవారు. 1969, జూన్‌లో ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రమండలంలో అడుగు పెట్టిన తర్వాత దీనిని హామ్‌గా పేరు మార్చారు. సమాచార ప్రసార వ్యవస్థలకు ఆద్యులైన మహనీయులు హెడ్జ్ (విద్యుత్ తరంగాలను కనుగొన్నవారు), ఆర్మ్‌స్ట్రాంగ్(చంద్రమండలం మీద కాలు పెట్టిన తొలి మానవుడుగా ప్రచారంలోకి వచ్చినవారు), మార్కొని(రేడియో కనుగొన్నవారు) ఈ ముగ్గురి పేర్లలోని మొదటి అక్షరాలే హామ్‌గా రూపొందాయి. ప్రపంచ ఎమెచ్యూర్ రేడియో దినోత్సవం ప్రతి యేటా ఏప్రిల్ 18న జరుపుకుంటారు.





యాత్రా కథనం

# 'ర్యాలి' చూసొచ్చాం! మళ్లీ ద్రాక్షారామానికి!

బొమ్మిరెడ్డిపల్లి ఇందిరాకృష్ణ

తూర్పు గోదావరి జిల్లాలో 'ర్యాలీ' సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉంది. దాన్ని చూడడానికి నాకెంతో మహదానందంగా ఉంది. అమ్మమ్మ అయితే ఎంతో సంతోష పడింది. ఆ తర్వాత ద్రాక్షారామమేనని..దర్శనానికి హామీ తీసుకుంది.

మేమంతా రావుల పాలెం వెళ్లే బస్సులో బయలు దేరాం. చుట్టుపక్కల పచ్చని పొలాల మధ్య కాలువలు దాటుకొంటూ మా బస్సు ప్రయాణం సాగింది. ప్రకృతి సోయగాలు చూడటం పూర్తిగా మునిగిపోయారు. మధ్యలో మండపేటలో బస్సు ఆగినప్పుడు ఆ తరువాత వచ్చే గ్రామమే ఆలమూరు అని చెప్పారు. అది దాటిన తర్వాత వచ్చేది గోదావరి నదీ తీరమన్నమాట.

గౌతమీ గోదావరి నది దగ్గరికి వచ్చేసాం. ఆ తర్వాత వచ్చేది రావులపాలెం. గోదావరి మీది బ్రిడ్జి ఒక కిలోమీటరు పైన ఉంటుంది.

ప్రయాణికుడొకరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా గోదావరి నది ధవళేశ్వరం దగ్గర రెండుగా చీలి చాలా దూరం తర్వాత బంగాళాఖాతంలో కలుస్తాయనే మాట వినిపించింది. వీటినే గౌతమీ గోదావరి, వశిష్ఠ గోదావరి అని అంటారని, ఈ రెండింటి మధ్యలో ఉన్న డెల్టాని 'కోనసీమ' అంటారని తోటి ప్రయాణికుల నుంచి సమాచారమందింది. గౌతమీ గోదావరి కోటిపల్లిని దాటుకొంటూ యానాం దగ్గర బంగాళాఖాతంలో కలుస్తుంది. అలాగే వశిష్ఠ గోదావరి కూడా, వైనతేయగా చీలి అంతర్వేది పాలెం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. గోదావరి గురించి వివరంగా విడమర్చి చెప్పడంతో బస్సు ప్రయాణికుల్లో చాలా మందికి ఆ ప్రాంతం భౌగోళిక స్వరూపం చాలామటుకు అర్థమైంది. రావులపాలెంలో దిగగానే ఊబలంక కరణంగారు మమ్మల్ని పలకరించి రెండెడ్ల బండి ఎక్కించారు.



మీకేం భయంలేదని భరోసా దొరికింది. ఇక్కడ నుంచి మూడు కిలోమీటర్లు ఊబలంక, మళ్లీ మూడు కి.మీ. దాటితే ర్యాలీ. ఊబలంకలోని వాళ్లింట్లో భోజనాలు ఏర్పాటు చేశారట. కొంత విశ్రాంతి తీసుకొన్న తర్వాత ర్యాలీకి వెళదామని ఆయన మా ప్రోగ్రాం వివరించి చెప్పారు. అందులో ఎడ్లబండిలో ప్రయాణం. పల్లెటూరు వాతావరణం రావులపాలెం నుంచి ఊబలంక వరకు ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా సాగింది. రోడ్డుకి ఇరువైపులా పచ్చటి పొలాలు, కొబ్బరి చెట్లు ఇంకా దారిపొడవునా మామిడి తోటలతో కళకళలాడింది. అందమైన ప్రకృతి వలన వాతావరణం అంతా చల్లగా అనిపించింది. గతుకుల రోడ్డు వలన ఎడ్లబండి కుదుపులతో కొద్దిగా కష్టమనిపించిందంతే. అమ్మమ్మ కూడా సరదాగానే కనిపించింది.

ఊబలంకలోని కరణం గారిల్లు పెద్ద మండవా లోగిలి. విశాలమైన ఆవరణ, పెద్ద హాలు, దానికి ఇరువైపులా రెండేసి గదులు. ఎదురుగుండా వంటగది. దాని వెనకాల విశాలమైన పెరడు. భోజనాలలో, మామిడికాయ పప్పు, గుత్తివంకాయ, పనస పొట్టుకూరలు, దప్పళం అంటే గుమ్మడికాయ పులుసుతో బాటు కమ్మటి ఆవునెయ్యి ఇంకా గడ్డ పెరుగు మామిడి పళ్ల తోటి సుష్టుగా భోజనాలయ్యాయి. అమ్మమ్మకి ఒక చిన్న ర్యాలీ దేవత విగ్రహం ఇచ్చారు. సంతోషాన్ని పట్టలేకపోయాం. దాదాపు మూడు కిలోమీటర్లు ప్రయాణం చేసి ర్యాలీ చేరుకున్నాం. తిన్నగా జగన్మోహిని కేశవస్వామి ఆలయం దగ్గరికి చేరుకున్నాం.

## స్థల పురాణం

గుడి పూజారి ఆలయ స్థల పురాణాన్ని వివరిస్తుంటే అమ్మమ్మ తదేక దీక్షతో వినసాగింది. మేమూ అంతే.

శ్రీమహావిష్ణువు జగన్మోహిని అవతారం ధరించిన సాగర మథనంలో వచ్చిన అమృతాన్ని రాక్షసులకు ఇవ్వకుండా అంతా దేవతలకే ఇచ్చి మాయమైపోతాడు.



జగన్మోహిని అవతారాన్ని చూసిన శివుడు ఆకర్షితుడై ఆమెను వెంటాడ తాడు. ర్యాలీ దగ్గరికి రాగానే మహావిష్ణువు వెనకకు తిరిగి తన అసలు రూపాన్ని శివుడికి చూపిస్తాడు. అప్పుడే మోహిని తలనుంచి ఒక పుష్పం రాలి కిందకు పడుతుంది. అందుకే ఆ ప్రదేశాన్ని ర్యాలీ అంటారు. శివుడు ఆగిన చోట శైవక్షేత్రంగా ప్రాశస్త్యం చెందింది. ఇక్కడ శివుణ్ణి శ్రీ ఉమా కమండలేశ్వర స్వామిగా పూజిస్తారు. ఈ ఆలయంలో మహా విష్ణువుగా అవతారాన్ని శ్రీ జగన్మోహిని కేశవస్వామిగా పూజిస్తారు. ఈ ఆలయంలో మహావిష్ణు విగ్రహం ముందు భాగంలో మహావిష్ణువుగా, వెనకాల భాగంలో జగన్మోహినిగా భాగంలో దర్శనమిస్తారు. ఈ విగ్రహం చాలా గొప్పగా ఉంటుంది. వెనకాల భాగం స్త్రీమూర్తిని పోలి ఉంటుంది.

స్థల ప్రాశస్త్యాన్ని ఇంకా వివరిస్తూ పూజారి విగ్రహ ప్రతిష్టాపన గురించి చెప్పారు. ఈ ప్రదేశమంతా ఒకప్పుడు చోళరాజు పాలనలో ఉండేది. పదకొండవ శతాబ్దంలో ఆనాటి రాజైన శ్రీరాజా విక్రమదేవవర్మ కలలో శ్రీ మహావిష్ణువు కనిపించి ఈ దేవత విగ్రహాలని ప్రతిష్టించమంటాడు. అలా రాజు వెలసిన విగ్రహాలని కనుగొని చిన్న గుడిని కట్టించి ప్రతిష్టాపన చేసాడు. అప్పటి నుంచి శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. అమ్మమ్మ దైవ ధ్యానంలో మునిగిపోయింది. మా తిరుగు ప్రయాణంలో ఊబలంక కరణం రావులపాలెం బస్సుస్టాండు దాకా వచ్చి మా బస్సు వచ్చేదాకా వున్నారు. అమ్మమ్మకు అలసట అనిపించలేదు. అంతటి దైవదర్శనాన్ని చేయించగలిగిన నన్ను తెగమెచ్చేసుకుంది. అంతకన్నా నాకేం కావాలి! అమ్మమ్మను ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దర్శనం చేయించాలి. ●

# క్లియర్ వాటర్ బీచ్



ఫ్లోరిడాలోని గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో ట్రై సిటీ మెట్రో ప్రాంతం అయిన టంపా బేలో భాగం అయిన ఈ నగరం 62 చ.మైళ్ళ విస్తీర్ణం కలిగి, సుమారుగా రెండున్నర లక్షలకు పైగా జనాభాను కలిగి ఉంటుంది.

ఈ నగరంలో నివసించే వారిలో ఇరవై శాతం పైగా వయోజనులు ఉంటారు. చక్కటి వాతావరణం ఈ ప్రాంతం స్వంతంగా భావిస్తుంటారు.

ట్రిప్ అడ్వైజర్ వెల్లడించిన దాని ప్రకారం అమెరికాలో 2016, 2018, 2019 సంవత్సరాల్లో క్లియర్ వాటర్ బీచ్ అవార్డులు స్వంతం చేసుకోగా, 2020, 2021, 2022 సంవత్సరాల్లో సెయింట్ పీట్ బీచ్ ఉత్తమ బీచ్ ఘనతను సొంతం చేసుకుంది.

## సెయింట్ పీట్ బీచ్

అమెరికాలో నున్న పదుల సంఖ్యలో గల అనేక బీచ్‌ల మాదిరిగా అధికంగా పర్యాటకులు సందర్శించే బీచ్ కాకపోయినా, ఆహ్లాదం కోసం పరిమిత సంఖ్యలో విచ్చేసే ఆనంద ప్రియులకు మానసికోల్లాసాన్ని కలిగిస్తుంది ఈ బీచ్.

ఇదొక కుటుంబ శైలి బీచ్. ఫ్లోరిడా రాష్ట్రంలోని 'టాంపా'కు వెళ్ళినప్పుడు 35 మైళ్ళ దూరంలో ఉన్న ఈ 'సెయింట్ పీట్ బీచ్'ను మేం సందర్శించాం. సృష్టిలోని అందాలు రాశిగా పోసినట్లు ఉంటుంది ఈ బీచ్. ప్రశాంతమైన అలలతో సందర్శకులను మంత్ర ముగ్ధులను చేస్తుంది ఈ బీచ్. ఎగిరిపడే డాల్ఫిన్‌లు కనులకు విందు చేస్తాయి.

ఫ్లోరిడా రాష్ట్రంలో అతి పెద్ద ఫ్రైడ్ వేడుకలకు ఈ బీచ్ ప్రముఖ నిలయం. డాన్ సీసార్ వద్ద 'స్పా' ఒసియానా, తీరక యాక్ చార్టర్స్, టంపా బే ఏవియేషన్, పురాతన గ్యాలరీలు, చుట్టుపక్కల ప్రాంతాలలో పైలట్ క్రూయిజ్‌లు, ఇంకా పిల్లలకు అనుకూలమైన ఆకర్షణలు అందించే మ్యూజియంలు.. ఇత్యాదివి ఈ బీచ్‌కు సమీపంలో వున్న ప్రత్యేక ఆకర్షణలు. ప్రత్యేక సందర్భన సందర్భాలలో పాక దృశ్యంలో రుచికరమైన వంటకాలు చవులూరిస్తాయి. పాస్ ఎగ్రిల్‌లోని చారిత్రాత్మక 8వ అవెన్యూ కళ, దుస్తులు, ఆభరణాలు, బహుమతులు, రెస్టారెంట్లు మొదలైన వాటికి ఈ బీచ్ ప్రసిద్ధి.

ఇక, బీచ్ మొత్తం తెల్లటి ఇసుకతో కాంతులీనుతుంది. సముద్రంలోని నీరు అప్పుడప్పుడు ఆకుపచ్చ రంగులోకి మారిన భ్రాంతి కలుగుతుంది. ఎంతసేపైనా, తీరం వెంబడి అలసట లేకుండా హాయిగా నడవవచ్చు.

ఇక, ఈ బీచ్ ఉండే నగరంలోని జీవన వ్యయం టంపా నగరం కంటే సుమారుగా మూడు శాతం తక్కువగా ఉంటుంది. క్లియర్ వాటర్ ప్రాంతం కంటే ఒక శాతం తక్కువగా ఉంటుంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ వెస్ట్ సెంట్రల్

అమెరికాలోని అన్ని బీచ్‌ల మాదిరిగానే సెయింట్ పీట్ బీచ్ వాతావరణ కాలుష్యం లేకుండా, అతి పరిశుభ్రంగా వున్నా కూడా జూన్ నవంబర్ ప్రాంతంలో అట్లాంటిక్ హరికేన్ సీజన్‌లో ఉష్ణ మండల తుపానులు పొంచి వుండే ప్రమాదాలు లేకపోలేదు.క్లియర్ వాటర్‌కు ఉత్తరాన ఉన్న సెయింట్ పీటర్ బర్గ్ ఫ్లోరిడాలో అత్యంత జనాభా కలిగిన ఐదవ నగరంగా గుర్తింపు పొందింది. వారాంతంలో ప్రశాంతత కోసం ఈ బీచ్ పరిసర ప్రాంత ప్రజలకు ఒక అందమైన ఎంపికగా భావించవచ్చు.

- పంతంగి శ్రీనివాస రావు

# సాఫ్ట్‌వేర్ అమ్మాయి

కథ

ఓట్ర ప్రకాష్ రావు

సుందరరామయ్య దూరపు బంధువైన పరమేశ్వరం ఇంటికి వెళ్లాడు.

మీ మనవరాలు పావని జాతకం, మా మనవడు విశ్వక్ జాతకం చాల బాగుందని చెప్పారు మా ఇంట్లో అందరూ అంగీకరించారు అన్నాడు, సుందరరామయ్య.

సుందరం మా ఇంటిలోని వారికీ ఈ సంబంధం అన్ని విధాలా నచ్చింది అన్నాడు పరమేశ్వరం.

"మీ మనవరాలు మా మనవడు ఒకసారి కలిసి మాట్లాడుకొని వారు అంగీకరిస్తే, తొందరలోనే మనం పెళ్లి తేదీని నిశ్చయించాలి పరమేశ్వరం" అన్నాడు.

ఆ పెళ్లి చూపుల కార్యక్రమం ఒక ఫార్మాలిటీ మాత్రమే" అన్నాడు పరమేశ్వరం.

ఒకరోజు పెళ్లి చూపుల కార్యక్రమంగా పావని విశ్వక్‌లు ఒక కాఫీ హోటల్‌లో కలుసుకొన్నారు.

"పావనీ, నీ పెండ్లి చూపులు ఎలా జరిగాయి?" ఆఫీసు కేంటీన్లో అడిగింది స్నేహితురాలు తేజస్విని.

"మనం అనుకొన్నట్లే నా నిర్ణయం చెప్పాను. నన్ను అతడి అభిప్రాయాలతో రాజీ చెయ్యాలని చూసాడు, నేను అంగీకరించలేదు" అంది పావని.

"అతడు చెప్పిందంతా మీ ఇంటిలో చెప్పావా పావనీ"

"మా ఇంటిలోని వారికి మన జనరేషన్ పద్ధతులు అంటే నచ్చవని చెబితే వాళ్ళు నన్నే తిడతారు. అందుకే మా ఇంటిలోని వారికి ఏమీ చెప్పలేదు".

"పావనీ, నీవు పెళ్లి చూపుల్లో వాడితో చెప్పింది తప్పేమీ కాదు. మన జీతం డబ్బులు కావాలి, కానీ మనం స్వేచ్ఛగా వుండకూడదు. మన డబ్బును అధికారంతో తీసుకొంటాడు. మనమూ అతనితో పాటు సమానంగా సంపాదిస్తున్నపుడు అతనికి వున్న స్వేచ్ఛ మనకు వుండదా?" అంది హాసిని.

ఆడవారిని దాసీలాగా చూసే ఆ కాలం పోయింది మనమూ వారికీ సమంగా ఎదుగుతున్నాం" అంది తేజస్విని.



అంతా తల తిక్క మనుషులు. మన సంబంధాన్ని చేజేతులా వద్దనుకున్నారు. మనలాంటి సంబంధం వారికీ కలలో కూడా దొరకదు పావనీ.. అన్నాడు పరమేశ్వరం ఏమిటి తాతయ్యా వాళ్ళు వద్దనుకున్నారా? అడిగింది పావని.

ఆ రోజు మనింటికి వచ్చినప్పుడు జాతకాలు చూసి బాగుందంటూ చెప్పారు ఇంతవరకూ ఫోన్ చేసినా సమాధానం చెప్పకపోవడంతో వారింటికి వెళ్లి అడిగితే అసలు సంగతి తెలిసింది ఏం మనుషులో!

"ఏం చెప్పారు తాతయ్యా?" అనుమానంతో అడిగింది పావని.

"ఆ తరువాత మరలా ఒక జ్యోతిష్యుడి దగ్గరకెళితే ఏమీ బాగోలేదని చెప్పాడట! ఈ సంగతి మీతో ఎలా చెప్పాలో అర్థంకాక మీరు ఫోన్ చేసినా ఎత్తలేదని చెప్పాడు" కోపంతో అన్నాడు పరమేశ్వరం.

"ఆ విశ్వక్ జరిగింది ఏమీ చెప్పనట్లుంది. అనుకొంది. ఇంకొకసారి పెళ్లి చూపులు అంటూ జరిగితే ముందుగానే తన అభిప్రాయం తల్లిదండ్రులకు చెప్పాలి" అని నిర్ణయించుకుంది పావని.

...........

ఏడుస్తున్న కావ్యను దగ్గరకు తీసుకొని ఓదార్చసాగింది పావని.

పరమేశ్వరం అప్పుడే ఊరినుండి వచ్చాడు. కావ్యను పావనిని గమనించకుండా కోడలివైపు చూస్తూ "వసుంధరా! మంచి సంబంధం తీసుకొనివచ్చాను, ఆ విశ్వక్ కన్నా ఎన్నో రేట్లు మంచి సంబంధం" అన్నాడు.

ఇల్లు కాలిపోయి ఒకరు ఏడిస్తే చుట్ట అంటించుకోవడానికి నిప్పు అడిగినట్లుంది.. ఇప్పుడు పెద్ద దాని కాపురం ఎలా చక్క చెయ్యాలని ఏడుస్తుంటే చిన్నదానికి సంబంధం అంటూ చెబుతున్నారే మామయ్యా" ఏడుపు గొంతుతో అంది వసుంధర కావ్య వైపు చూసి.

"కావ్యకు ఏమైంది?" అడిగాడు పరమేశ్వరం.

"మామయ్యా, మన కావ్య భర్త ఇంతటి రాక్షసుడు అనుకోలేదు. కొట్టడానికి వస్తే ఇల్లు వదిలి ఇక్కడకు వచ్చింది"

"ఏమిటీ? కొట్టడానికి వచ్చాడా నువ్వేం తప్పు చేసావు కావ్యా!"

"నేనేమి తప్పు చెయ్యలేదు తాతయ్యా" అంది కావ్య.

"నువ్వు తప్పు చెయ్యవులే నువ్వు ఏమి చేసావో చెప్పు" అన్నాడు అసహనంగా.

"నేను ఆయనకు చెప్పకుండా సినిమాకు వెళ్ళాను. ఆ రోజు ఆయన ఇంటికి తొందరగా వచ్చారు. నేను ఇంటికిరాగానే ఇష్టం వచ్చినట్లు తిట్టాడు.

మాటా మాటా పెరగడంతో కొట్టడానికి వస్తే ఇంట్లో వుండను అంటూ వచ్చేసాను" ఏడుస్తూ అంది.

"ఏమిటి? సినిమాకు వెళ్ళడానికి కూడా స్వేచ్ఛ లేదా అక్కా? ఇలాంటి వాళ్ళను వదలకూడదు" కోపంగా అంది పావని

"ఆయనకు చెప్పకుండా వెళ్లినందుకు కోపం కాదు" "మరి దేనికి?"

అంతలో ఫోన్ రింగ్ కాగానే తీసి చూస్తూ "మీ బావ ఫోన్ చేస్తున్నాడు ఎవరూ లేకుంటే ఎలా మాట్లాడతాడో చూడండి స్పీకర్ ఆన్ చేస్తాను" అంటూ స్పీకర్ ఆన్ చేసిన తరువాత ఫోన్ ఎత్తి "ఊ.. చెప్పు. ఏమిటి? నేనింకా ఇంటికి వెళ్లకముందే ఫోన్ చేసావు?" అంది కావ్య.

"ఏంటీ? ఇంకా ఇంటికి వెళ్లలేదా ఇక్కడ సినిమాకు వెళ్లినట్లు అక్కడ కూడా సినిమాకు వెళ్ళావా?"

"నీవు మరలా ఎక్కువగా మాట్లాడుతున్నావు"

"కావ్యా, నా అనుమతి లేకుండానే ఇల్లువదలి దాటి వచ్చావు".

"మరి కొట్టడానికి వస్తే.."

"కొట్టడానికి అన్నట్టుగా చేయి పైకెత్తాను కానీ నిన్ను కొట్టానా" "కొట్టక పోవచ్చు. అయినా చేయి ఎత్తి భయపెట్టవలసినంత తప్పు నేనేమి చేయలేదు. అసలు వంద రూపాయలు టికెట్ దొరుకుతుందని మన వీధిలోని వారితో వెళ్ళాను. అందరూ ఐదు వందలు డబ్బు పెట్టి కొనడానికి సిద్ధమయ్యారు వారందరికీ ఖర్చు పెట్టడానికి వున్న స్వేచ్ఛ నాకు లేదా? మొదట వద్దని వ్యతిరేకించినదాన్ని నేను ఒక్కదాన్నే"

"డబ్బు విలువ తెలియని వారితో నీకు స్నేహమెందుకు"

"వాళ్లకు డబ్బు విలువ లేదని నాకు తెలుసు. స్నేహం కోసం ఏదో పుష్కరానికి ఒకసారన్నట్లు ఎప్పుడో ఒక్కసారి తప్పదు. అందుకే అంగీకరించాను".

"కావ్యా, నీవు చేసింది తప్పనిపించి కొంచెం కోపంగా ప్రవర్తించవలసి వచ్చింది"

"తప్పెలా ఔతుంది? నేనూ ప్రైవేట్ స్కూల్ టీచరుగా పనిచేస్తూ సంపాదిస్తున్నానుగా. ఒక ఐదు వందల రూపాయలు పొరపాటున ఖర్చు పెడితే సరే అని సర్దుకుపోవచ్చుగా! అన్నిట్లోనూ నేనే సర్దుకు పోతున్నాను".

"ఏమిటి? అన్నిట్లోనూ నీవే సర్దుకు పోతున్నావా? ఏమిటి సర్దుకు పోతున్నావు?"

"ఒక ఐదు సంవత్సరాల వరకు పిల్లలు వద్దన్నావు. ఇష్టం లేకున్నా అంగీకరించాను. నేనూ నీలాగే ఉద్యోగం చేస్తున్నా ఒక్క రోజైనా ఇంటిపనులలో సహకరించావా? అయినా నీవు చేయవని తెలిసి నేను నిన్ను అడగలేదు. నీవు ఎప్పుడైనా పిల్లలు కావాలని చెప్పివుంటే నేను అంగీకరించేవాడిని. నేను నిన్ను ఉద్యోగం చెయ్యమని చెప్పలేదు నా క్యాబ్ వస్తోంది ఇంటికెళ్ళాక ఫోన్ చేస్తాను" అంటూ ఫోన్ కట్ చేసాడు.

"పావనీ, నాకు భార్య కావాలి.. అంతేకానీ డబ్బు సంపాదించే భార్య కావాలని నేను కోరుకోలేదు. ఉద్యోగం ఎంతో టెన్షన్‌కు గురి చేస్తుందని నీవే చెప్పావు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఎంత టెన్షన్‌గా వుంటుందో నాకూ తెలుసు. నీవు కావాలంటే ఉద్యోగం మానుకో" అన్న విశ్వక్ మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఈ మగాళ్లు అందరూ అంతే. పెళ్లి చేసుకొనడానికి ఉద్యోగం చేసే అమ్మాయి కావాలని వెతుకుతారు. ఇంట్లో ఏదైనా తేడాలు వచ్చిందంటే నాకు నీవు ఉద్యోగం చేయవలసిన పనిలేదు నీవు ఉద్యోగం మానుకో అంటారు. నేను ఉద్యోగం చేయని అమ్మాయిని పెళ్లి చేసుకొంటానని చెప్పరు. మొన్న నన్ను చూడటానికి వచ్చినవిశ్వక్ కూడా అలాగే చెప్పాడు" కోపంగా అంది పావని.

"పావనీ, ఏమిటి నీవంటున్నది అంటే జాతకాలు బాగోలేదని చెప్పింది అబద్ధమా? అసలు మీరిద్దరూ కలుసుకొని ఏమి మాట్లాడుకున్నారు" ఆశ్చర్యంగా అడిగాడు పరమేశ్వరం

"తాతయ్యా, ఇప్పుడు వాళ్ళు మన సంబంధం వద్దని చెప్పారుగా అది వదిలెయ్యండి ముందు కావ్య సంగతి చూడండి" అసహనంగా అంది పావని

"వసుంధరా, సమయం దొరికినప్పుడు పావనిని అడిగి తెలుసుకో. ఇప్పుడు కావ్య గురించి ఆలోచించాలి" అన్నాడు.

ఆ రాత్రి పావని దగ్గరకెళ్ళి ప్రశ్నించింది "అమ్మా, మేం అక్కా, బావలలాగా గొడవ పడలేదు. నేనంటే అతనికి ఇష్టం లేదని గ్రహించాను. ఆ మాట సూటిగా చెప్పకుండా జాతకాలు బాగోలేవని అబద్ధం చెప్పాడు" అంది పావని. వారం రోజులు గడిచాయి.

కావ్య ఏదో జరగకూడనిది జరిగినట్లు బాధపడుతూ ఎప్పుడూ కూర్చొని వుండటం చూసిన పావని భరించలేకపోయింది. సరిగ్గా తిండి తినడం లేదు తల దువ్వుకోకుండా చింపిరి జుట్టుతో ఏదో కోల్పోయినట్లు ఉండసాగింది

"అక్కా, అనవసరంగా ఎందుకు బాధపడతావు?"

"ఆయనకు హోటల్ తిండి పడదు. నేను తొందర పడ్డానేమో! ఎన్ని సార్లు ఫోన్ చేసినా నేనే ఫోన్ ఎత్తలేదు".

సరిగ్గా అప్పుడే పక్క గదిలో నుండి వసుంధర "ఏంటి మామయ్యా, మీ నస ఎక్కువయింది. ఇలా రండి.. అంటూ అక్కా చెల్లెళ్లున్న గదిలోకి వచ్చింది.

"కావ్యను చూడండి.. ఒక్క వారం రోజులకే తిండి తినకుండా నిద్ర లేకుండా

**"కావ్యా, నీవు చేసింది తప్పనిపించి కొంచెం కోపంగా ప్రవర్తించవలసి వచ్చింది"**

**"తప్పెలా ఔతుంది? నేనూ ప్రైవేట్ స్కూల్ టీచరుగా పనిచేస్తూ సంపాదిస్తున్నానుగా. ఒక ఐదు వందల రూపాయలు పొరపాటున ఖర్చు పెడితే సరే అని సర్దుకుపోవచ్చుగా! అన్నిట్లోనూ నేనే సర్దుకు పోతున్నాను".**

బాధపడుతూ ఎలా అయిందో! ముందు కావ్యను బాగుపరచిన తరువాత పావని పెళ్లి గురించి ఆలోచించండి" అంది వసుంధర. "ఈ వారం రోజులు నేను బాగా ఆలోచించాను. నేనే తప్పు చేసాననిపిస్తోంది పావనీ".

"నీ స్వేచ్ఛను అడ్డుకునే భర్తతో కాపురం చేయడం కష్టం అక్కా"

"పావనీ, నీవు నోరుమూసుకో. అదిప్పుడే చేసిన తప్పును గ్రహించి సరిదిద్దుకుంటోంది. మీ అక్క ఆ రోజు సినిమాకు వెళ్ళడానికి ముందు చెప్పకుండా వెళ్లినా మాటవరసకైనా ఫోను ద్వారా చెప్పొచ్చుగా. కనీసం ఒక్క మెసేజ్ అయినా పెట్టలేదు. ఆ రోజు మాట మాటా పెరిగింది తప్ప పెద్ద గొడవ జరగలేదు" అంటూ చెప్పిన తరువాత "కావ్యా నీ అభిప్రాయం చెప్పమ్మా" అంది వసుంధర.

ఆయన నన్నింతవరకు ఒక్క మాట అనలేదు. నేనే నోరుజారడం వలన ఆయన ఆవేశంతో నేనే ఫోన్ చేసి ఆయన దగ్గరకు వస్తున్నట్లు తెలుపుతాను నేను తప్పు చేశానన్న భావన కలుగుతోందమ్మా".

"అక్కా, నీకు స్వేచ్ఛ ఇవ్వని భర్తతో.." అంటున్న పావని మాటలకు అడ్డుపడుతూ పావనీ, ఇక మీ అక్క గురించి మాట్లాడవద్దు. అది తన జీవితాన్ని బాగు చేసుకొంది కార్యేషు దాసి.. మాత్రమే కాదు కరణేషు మంత్రి అన్న సంగతి మరిచావా? నాకిప్పుడు నీ మీద అనుమానం కలుగుతోంది. ఆ రోజు విశ్వక్‌తో ఏం మాట్లాడావో వివరంగా చెప్పు.. కోపంతో అంది వసుంధర.

కాలేజీ చదువు వరకు భర్త అంటే అమ్మ నాన్నలు చెప్పిన అబ్బాయిని పెళ్లి చేసుకొని మంచి గృహిణిగా పేరు తెచ్చుకోవాలని అనుకునేదాన్ని. ఐటీ పనిలో చేరాక మా మైండ్ సెట్ అంటే నాదే కాదు నా స్నేహతురాళ్ళ మైండ్ సెట్ పూర్తిగా మారిపోయింది. భర్తతో సమంగా జీతం తీసుకొంటున్నప్పుడు స్వేచ్ఛగా జీవితం గడపాలనుకొన్నాను. ఇంటిపనులు సమంగా చెయ్యాలన్న భావన ఏర్పడింది. అంటే ఆ అబ్బాయిని వంట చేయమని చెప్పావా? అడిగాడు పరమేశ్వరం.

"తాతయ్యా, నేను మరికొంత లోతుగా ఆలోచించాను. అందుకే చాలా పెళ్ళికొడుకులను తిరస్కరించాను".

"ఏమిటి.. నీవు అంటున్నది?"

"విశ్వక్ తండ్రి మరణించడం వలన తల్లి మాత్రం వుంది ఆ ఇంటిలో. సంబంధం అయితే వంట చేసే పని లేకుండా శని ఆదివారాలలో స్వేచ్ఛగా విశ్రాంతి తీసుకోవడం లేక ఎక్కడికైనా భర్తతో వెళ్ళవచ్చు.. అనుకొన్నాను.

"ఎంతటి పాడు ఆలోచనలు వచ్చాయే" అంది వసుంధర.

"కానీ నేననుకొన్న విధంగా కాకుండా విశ్వక్ తన తల్లిని సొంత గ్రామంలో వుంచదలచినట్లు చెప్పగానే నేను నిరుత్సాహపడ్డాను, అప్పుడు నా నిర్ణయాన్ని చెప్పాను

"ఏమని చెప్పావు?"

"నేను శని, ఆదివారాల్లో వంటగదిలోకి వెళ్లకుండా వుండాలని నిర్ణయించుకున్నాను. అందుకోసం మీ అమ్మ మనతో పాటు వుండాలి అని చేప్పాను" అంటూ తల వంచుకొంది పావని



"దేవుడా, నా కూతుళ్లు ఇలా మారిపోయారేమిటయ్యా! వాళ్ళ మనసులో మాట నాకు చెప్పి వుంటే నేను సరిదిద్ది వుండేదాన్ని" అంటూ తల పట్టుకొని కూర్చొంది వసుందర

"పావనీ, స్వేచ్ఛ అంటే బాధ్యతలకు లోబడిన స్వతంత్రత అన్న విషయాన్ని మరచిపోతున్నారు. ఈ తరంలో కొంతమందికి అహం పెరిగిపోయి సమానంగా చదివాం. సమానంగా సంపాదిస్తున్నామంటూ స్వేచ్ఛకు కొంతమంది విపరీతార్థాలు ఇస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారు. స్వేచ్ఛ పేరుతో 80 జీవితాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అలాంటి వారిని నీవు పనిచేస్తున్న చోట చూసి వుంటావు ఇకమీదట అయినా మంచి నిర్ణయం తీసుకో" అన్నాడు పరమేశ్వరం

"సారీ తాతయ్యా, నేను తప్పు చేసాను" అంది పావనీ.

"కావ్యా, ఆలస్యం అమృతం విషం అంటారు. నీవు వెంటనే బయలుదేరు నేను నిన్ను బస్టాండ్ దగ్గర దిగబెడతాను" అంటూ చెప్పిన తరువాత పావని వైపు చూస్తూ "పావనీ, నేను అలాగే విశ్వక్ ఇంటికి వెళ్తాను. ఒకవేళ వారు అంగీకరిస్తే నీవు పెళ్ళికి ఒప్పుకుంటావా?" అంటూ అడిగాడు పరమేశ్వరం.

"అలాగే తాతయ్యా. ఇప్పుడే విశ్వక్‌కు ఫోన్ చేసి సారీ చెబుతాను" అంది పావని.

కావ్య, పరశురామ్ ఆటోలో కూర్చున్నాక ఆటో బయలు దేరింది

"విశ్వక్ మంచివాడమ్మా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు.." అంటూ చెబుతున్న పరమేశ్వరం మాటలకు అడ్డుపడుతూ.. "పావని గురించి మన బంధువుల్లో అందరూ గొప్పగా చెప్పారు.. ఈ సాఫ్ట్ వేర్‌లో పనిచేస్తున్న అమ్మాయిల్లో స్వేచ్ఛ గురించి ఎక్కువగా మాట్లాడటం మాకూ తెలుసు. పావనికున్న స్నేహితురాళ్ల వలన ఆమె పెళ్లి విషయంలో మైండ్ సెట్ మారినట్లు ఊహించాను. పావని అమాయకత్వం చూసి లోలోన నవ్వుకొన్నాను. పావని మీద కోపం లేదు. మీరు పావనిలో మార్పు తెప్పించడానికి మరికొంత సమయం కావాలంటే తీసుకోండి. అంటూ అతను మీతో చెప్పిన సంగతి నాతో ఎప్పుడో చెప్పారు" అంది కావ్య.

తాతయ్యను కదా ఒక్కొక్కసారి చెప్పిందే చెబుతారు "తాతయ్యా, నేను టీవీ సీరియల్స్ చూస్తున్నప్పుడు నాకూ నటించాలనిపించేది. పావనిలో మార్పు తెప్పించడం కోసం మనమందరం నటించాం" అంది కావ్య.

"పెళ్లి విషయంలో పావనిని బలవంతంగా అంగీకరించేలా చెయ్యకూడదు" అంటూ విశ్వక్ చిన్న షరతు పెట్టాడు. పావని చేత నిజం చెప్పించి మార్పు తెప్పించడం కోసం మనమందరం కలసి నాటకం ఆడాం. ఆ నాటకంలో తిండి తినకుండా ఏడుపు మొహంతో చాలా చక్కగా నటించావు. కాదు కాదు జీవించావు. నీవు కడుపునిండా తిండి తిని చాలా రోజులయిందిగా ముందు హోటలుకెళ్ళి తిన్న తరువాత బస్టాండుకు వెళ్దాం" అన్నాడు పరమేశ్వరం.

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

*sunmagvaartha@gmail.com*

# తెలుగు సాహిత్యంలో వేమన



జయసూర్య

వేమన, సాధారణ కర్షక కుటుంబంలో జన్మించాడు. 18వ శతాబ్దంలో నివసించిన వేమన కాలంలో మన సమాజం మత, కుల, భేదాల సంకుచిత అరాచక మూఢాచారాలతో పతనావస్థలో ఉంది. మధ్య తరగతి రైతు కుటుంబానికి చెందిన వేమన, సంచార విరాగిగా తన జీవితానుభవాలను రంగరించి మోసం, దాంబికంలేని నిజమైన జ్ఞానయోగంతో అతినిశితమైన ఆటవెలది పద్యాలలో ఎక్కడికక్కడ చెప్పుకుంటూ కొన్ని ఏళ్ళపాటు ఆంధ్ర దేశమంతటా తిరిగాడు. ఆధునిక సమాజ నిర్మాణానికి, తెలుగులో అభ్యుదయ కవిత్వానికి 260 సంవత్సరాల క్రితమే పునాది వేసిన వేమన 1750 ప్రాంతం వరకు జీవించిన మహాకవి.

నాటి ఆంధ్రదేశంలో ప్రజాజీవితం సంక్షోభంలో చిక్కుకొంది. వైష్ణవ, శైవమతాల మూఢత్వం, దుర్వ్యసనాలు సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయి. అగ్రవర్ణాల దాంబికం, కుల, మత, వైషమ్యం సమాజాన్ని పట్టి పీడిస్తోంది. మంత్ర తంత్రాలు వికృత రూపంలో, అంతూ పొంతూ లేని కర్మకాండ ఆధిపత్యం చెలాయిస్తోంది. జీవిత సమస్యల పరిష్కారానికి గౌతమబుద్ధుడు నిర్వాణ మార్గాన్ని చేపట్టినట్టు అతి సామాన్యుడైన వేమన అద్వైత తాత్త్వికతతో, సమాజ తీరుతెన్నులపై కొరడా ఝుళిపించాడు. వేమనపద్యాల వంటి అచ్చతెలుగు పద్యాలు ఇంతవరకు తెలుగుభాషలో లేవు. కవిత్వాన్ని ఉపయోగించుకొని వేమన తెలుగుభాషలో లోకోక్తులు, నీతులు, జాతీయాలు కుప్పతెప్పలుగా కురిపించాడు. అంతకు పూర్వంలేని హాస్యాన్ని, సున్నితంగా విమర్శలతో వెగటు కలిగించని రీతిలో జ్ఞానాన్ని అందించాడు. సరళసుందరమైన భాష, కమ్మని తెలుగుతనపు తీరుతెన్నులు, చమత్కారపు పదజాలం, సూటిమాటల వేగంతో వేమనపద్యాలకు సాటి లేదు. చెప్పదలచుకొన్నది సూటిగా చెప్పటం వేమనకు ఇష్టం. నీతులు, చమత్కారాలు, హాస్యోక్తులు అన్నీ సమాజాన్ని మేల్కొలపడానికే, అందుకే ఆత్మశుద్ధిలేని ఆచారాలు, చిత్తశుద్ధిలేని శివపూజలను తీవ్రంగా విమర్శించాడు. రామాయణ, భారత గాథల దేవతలను కూడా వేమన వదిలిపెట్టలేదు. “తెలివి లేనివాడు దేవుడెట్లాయెరా” అని ప్రశ్నించే తిరుగుబాటు స్వేచ్ఛాజీవిగా ఎదురు తిరిగిన వేమనను సహజంగా ఆ రోజులలో కవి, పండితలోకం పక్కన పెట్టింది.




వేమన తాను మహాకవి అవటానికి ఆలోచించలేదు, ప్రయత్నించలేదు. దేశద్రిమ్మరిగా జీవించిన ఆయన వ్యక్తిత్వం అపురూపమైనది. ఆనాటి ఆంధ్రసాహిత్య యుగకర్తలు వేమనను కవిగా గుర్తించలేదు. బ్రౌన్‌దొర ‘వెర్సెస్ ఆఫ్ వేమన’ అనే ఆంగ్లానువాదంలో కూడా వేమనను అంతగా ప్రశంసించలేదు. అయినా వేమన తెలుగు ప్రజాకవిగా జనజీవితంలోకి అడుగుపెట్టడం, ఆయన అభిప్రాయాలు, భావాలు, పద్యాల, మాటల తీరుతెన్నులు నేటికీ ప్రభావితం చేయడం కారణంగా మహాకవి స్థాయి అందుకొన్నాడు.

తెలుగు సాహిత్యంలో ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ త్రిమూర్తులైన కవిత్రయంగా శ్రీశ్రీ పేర్కొన్నారు. వేమన జీవితం అనుభవాలు, అన్వేషణల తత్త్వవేత్తగా, అద్వైతిగా, విరక్తిగా, సంచారయోగిగా నడిచింది. భేషజాలు, ఆడంబరాలను ఎదిరించిన వేమనపద్యాలు, జ్ఞానసత్యాలుగా సమాజాన్ని ప్రశ్నించాయి. వేమన పండితుడు కాదు. వేదాలు చదవలేదు. సుఖదుఃఖాలు అనుభవించిన సామాన్య విరాగిగా సమాజహితాన్ని కాంక్షించాడు. కాలానికి అతీతమైన శాశ్వత విలువలను అందించారు. అస్పష్టత లేకుండా సూక్ష్మంగా, సులభంగా వ్యవహారజ్ఞానం అందించాడు. మానవజీవన విలువల పతనాన్ని, వ్యవస్థ లొసుగులు దృష్టిలో పెట్టుకొని సంప్రదాయంపై నైతికధ్వజం ఎత్తిన జ్ఞానయోగి వేమన. పిండాలనుచేసి పితరులను తలపోసి కాకులకు పెట్టే సంప్రదాయ ఆచారాలను ఎదురుతిరిగి ప్రశ్నించిన వేమన, నాటి పండిత కవులను ఒప్పించ లేకపోయాడు. మానవతావాదిగా, జగమెరిగిన వేదాంతిగా, సంఘసంస్కారిగా, సాహిత్య, సామాజిక తిరుగుబాటువాది అయిన వేమనను మధ్యయుగానికి చెందిన దార్శనిక తత్త్వవేత్తగా, భవిష్య తరాలు తెలుగుసాహిత్యం సజీవంగా వున్నంతకాలం, తెలుగు జనజీవనం సాగినంత కాలం గుర్తిస్తూనే వుంటాయి.

వేమన పద్యాలను 1829లో తొలి ప్రచురణగా 693, 1839లో 1163 పద్యాలు, అదనంగా 201, మొత్తం 2057 పద్యాలు బ్రౌన్ దొర ద్వారా ప్రచురితమై వెలుగులోకి వచ్చాయి. అంధకారంలో మూఢవిశ్వాసాలతో జాతి మగ్గుతున్నంత కాలం జనావళికి వేమన పద్యాలు జ్ఞానజ్యోతిని ప్రసరింప చేస్తూనే ఉంటాయి.

వేమన పద్యం పేరుతో, తర్వాతకాలంలో వేలకొలది పద్యాలు పుట్టుకొచ్చాయి. కాని వేమన పద్యాల ప్రత్యేకశైలి, విశిష్ట భావజాలం స్పష్టం కావటంతో, ప్రజలు వాటిని అంగీకరించలేదు. ఉదాహరణకి “ఉప్పుకప్పురంబు నొక్కపోలిక నుండు” పద్యంలో మొదటి పాదంలో ఆ విషయం చెప్పి రెండవ పాదంలో “చూడ చూడ రుచుల జాడ వేరు” అనడం ఆ పరస్పర వ్యతిరేక ధర్మాన్ని సమన్వయం చేస్తూ, మూడవ పాదంలో “పురుషులందు పుణ్యపురుషులు వేరయా” అనే భావన, జీవనసత్యం అందించడం వేమనకే చెల్లింది. తెలుగుజనావళి నాలుకలపై నిత్యం నాట్యమాడేటట్టు వేమనపద్యాలు భవిష్యత్ తరాలకు అందించే విద్యా విధాన పరమైన కృషి పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించాలి.

# ముక్కోపి అంటే?

యామిజాల జగదీశ్

"కోప్పడకు.. అని పదే పదే చెప్తుంటావు, నీకేం బాగానే చెప్తావు. కానీ అదెలా సాధ్యం?" అని అనగానే కోప్పడే మనుషులను మనం చూస్తూనే ఉంటాం. ఇతరులను కోప్పడకు అని చెప్తూ వాళ్లే కోప్పడుతుంటారు. అది సముచితమైన కోపమేనా? అని ఆలోచించరు ఎవరూ.

ఒకరినొకరు అర్థం చేసుకుంటే కోపం రాదని చెప్పడం కద్దు. ఒకరు ఒకరిని అర్థం చేసుకోవడానికి ముందర ఈ కోపం గురించి అర్థం కాస్తంత అర్థం చేసుకోవలసి ఉంది.

కోపం రావడం సర్వసహజం. అయితే ఆ కోపాన్ని ఏ సందర్భంలో ఎలా ప్రదర్శిస్తున్నామనేది ముఖ్యం. దానిని బట్టే కోపం వల్ల మంచో చెడో ఏదో ఒకటి జరగడం తథ్యం.

సరేగానీ అదలా ఉండనిద్దాం. ఇప్పుడు శాస్త్రీయ పరంగా ఆ కోపం గురించి చూద్దాం.

సహజమని అంటాం కదూ అంటే నేచురల్ ఇన్‌స్టింక్ట్. వాటిలో కోపమూ ఒకటి. ఓ సదుద్దేశంతోనే కోపాన్ని ప్రకృతి మనకిచ్చింది. దానిని మొదటగా మనం అర్థం చేసుకోవాలి.

పాము పడగ విప్పుతుంది. తేలు కుడుతుంది. ముళ్ళపంది చలిస్తుంది. పులి గాండ్రిస్తుంది. సింహం గర్జిస్తుంది. గాడిద వెనక కాలిని కదిలిస్తుంది. ఇవన్నీ కోపాలే. దేని కోసం ఈ కోపం వస్తుంది. స్వీయ రక్షణ కోసం.

గాడిద తన్నదు. ఆవు కుమ్మదు. తేలు కుట్టదు. పులి దాడి చేయదు. ఇలా అంతా జరిగితే అవన్నీ ఎప్పుడో ఈ భూమ్మీద కనిపించకుండా పోయేవి. సహజ గుణంగా అవన్నీ తమ తమ కోపాన్ని ప్రదర్శిస్తుంటాయి. అది సర్వసహజం. ఈ తేలుంది చూసారూ అది చాలా సాత్వికం. ఒక్కరినీ కుట్టదు అని అంటే అది బహుశా రబ్బరు తేలు అయి ఉండొచ్చు.

మిగిలిన ప్రాణులకు, మనిషికి మధ్య ఓ తేడా ఉంది. మనిషికి ఆలోచించే గుణం ఉంది. అందువల్ల అతను స్వీయ రక్షణ కోసం మాత్రమే కాకుండా మరొక కారణం కోసం కోపాన్ని ప్రదర్శిస్తాడు.

న్యాయం కోసం కోప్పడవచ్చు. నీతి కోసం కోపాన్ని ప్రదర్శించవచ్చు.


మహాత్ముల కోపం..

గాంధీ సత్యాగ్రహం..

దేవుడు మూడో కన్ను తెరిచాడు..

అని ఇలా ఏవేవో అంటుంటాం. అవన్నీ ఈ రకానికి చెందిన కోపాలే. కోపం ఓ శక్తి అని శాస్త్రం అంటోంది.

గుండె వేగంగా కొట్టుకుంటోంది. పెదవులు వేగంగా కదలటం, పళ్ళు కొరకటం కళ్ళు ఎరుపెక్కడం, రక్తం వేగంగా



ప్రవహించడం, మాటలు తడబడటం, కోపం వచ్చినప్పుడు మనిషి దేహంలో ఏదో ఒక మార్పు కనిపిస్తుంది. కోపాన్ని ప్రదర్శించేటప్పుడు ఇటువంటి మార్పులు ఉంటాయి. సాధారణ మనుషులకు కోపం ఇలా వెల్లడవుతుంది. అదే మహాత్ములకైతే కోపం ఇలా బయటపడదు. అది మూడో కన్నుగా వస్తుంది. సత్యాగ్రహం వస్తుంది.

మనమందరం ఏం చేస్తాం. కోపాన్ని ద్వేషంగా మారుస్తాం. అర్థం పర్థం లేని ఆవేశంతో గతి తప్పి ప్రవర్తిస్తాం.

ఆ తర్వాత మన కోపానికి మనమే సిగ్గుపడతాం. ఇబ్బందిగా ఫీలవుతాం. అందుకే కోపాన్ని పాపమని పెద్దలు చెప్తుంటారు. కోపమూ ద్వేషమూ కలిస్తే పాపం. కోపమూ ప్రేమా కలిస్తే పుణ్యం.

అవినీతి పట్ల కోపం వస్తోందా? దానితో ప్రేమ అనే వేడిని కలపాలి. అది సత్యాగ్రహం అవుతుంది. ఆ అద్భుతాన్ని ఆచరించి చూపినవారు గాంధీ మహాత్ముడు. కనుక కోపాన్ని ద్వేషించకండి. దానిని అర్థం చేసుకోవాలి. కోపమూ ప్రేమా కలిస్తే పుణ్యమని చెప్తారు. అందువల్లే పలువురు దంపతులు పుణ్యం చేసారని అంటుంటారు సరదాగా. ఈ రెండింట్లో ఒకటి కోపం, మరొకటి ప్రేమ. కోపం రాకూడదనే అనుకుంటాం. కానీ మనకు తెలియకుండానే కోపం వచ్చేస్తుంది.

ఒకడు తిన్నగా వచ్చి మన జేబులో చెయ్యి పెట్టి ఏదన్నా తీసుకుంటే చటుక్కున కోపం రావడం సహజం. ఆ సమయంలో మనమెంతలా నియంత్రించాలనుకున్నా కుదరదు. మన చేతిలో ఏమీ ఉండదు. అలా కాకుండా ఇదిగో మరో పది రూపాయలు తీసుకో అని అంటామా?

.........

ఒకతను అయినదానికీ కానిదానికీ కోపంతో ఊగిపోయేవాడు. అతనికి కొందరు ముక్కోపి అని పేరు పెట్టారు. ఒకరోజు అతనిని వెతుక్కుంటూ ఒకడొచ్చాడు. ఆ వచ్చిన మనిషికి అతనే ముక్కోపి అని తెలీదు. కనుక "ఈ ఊళ్ళో ముక్కోపి అని ఒకరున్నారట, అతను ప్రతి దానికీ కోప్పడుతుంటాడట. అతడి గురించి ఎవరెవరినో అడిగాను. కానీ ఎవరూ తమకు తెలీదని తప్పుకుంటున్నారు. మీరైనా తెలిస్తే చెప్పండి. అతనిని చూస్తాను" అని చెప్పాడా మనిషి.

అతని మాటలకు ముక్కోపి నాకూ తెలీదు అని కోపంగా అరిచాట్ట. అదండీ కోపం సంగతి..!

# ఈశాన్య లోపం అంటే?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**


**డా॥ దంతూరి పండరినాథ్**

సెల్: 9885446501/9885449458




**(గత వారం తరువాయి)**

వీధిపోట్లలో ప్రముఖంగా చెప్పుకునే వీధి పోటు లేదా వీధి చూపు ఒకటి ఉన్నది. ఒక స్థలానికి కానీ, గృహానికి కానీ పటంలో చూపించిన విధంగా తూర్పు భాగం తూర్పు ఈశాన్య భాగంలో ఒక వీధి వచ్చి తగిలినట్లయితే దానిని “తూర్పు ఈశాన్య వీధి చూపు” అంటాం.




తూర్పు ఈశాన్య భాగంలో తగిలేటటువంటి వీధి చాలావరకు “వీధిచూపు”గా పరిగణింపబడుతుంది. అది ఖాళీ స్థలం కావచ్చు, క్షేత్రం కావచ్చు, గృహం కావచ్చు, గృహానికి ఉన్న కాంపౌండ్ గోడలు కావచ్చు. తూర్పు ఈశాన్య భాగంలో తగిలేటటువంటి వీధిని “వీధి చూపు”గా పేర్కొంటారు. కొన్ని సందర్భాలలో ఈ వీధి స్వరూప, స్వభావాల రీత్యా విరుద్ధ ఫలితాలను కూడా ఇచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాలలో దీనిని “తూర్పు ఈశాన్యం వీధి పోటు”గా కూడా పరిగణిస్తారు.

మంచి ఫలితాలను ఇచ్చేవి వీధి చూపులని, చెడు ఫలితాలను ఇచ్చేవి వీధిపోటులు అని ముందే వివరించటం జరిగింది. ఈశాన్యంలో తగిలే అన్ని వీధులు మంచి ఫలితాలను ఇస్తాయి అన్న నమ్మకం చాలా మందిలో ఉంది.

కానీ కొన్ని తూర్పు ఈశాన్య వీధులు చెడు ఫలితాలని ఇచ్చేవిగా కూడా ఉంటాయి. అందువల్ల తూర్పు ఈశాన్యం వీధిచూపు స్థలం ఏదైనా అమ్మకానికి వచ్చినా, నివాసానికి దొరికినా, దాన్ని మనం సరిగ్గా అంచనా వేయగలగాలి. ఎనభై శాతం మంచి వీధి చూపులే ఉంటాయి. కానీ ఒక ఇరవై శాతం కొంచెం అటు ఇటుగా ఉంటాయి. తూర్పు ఈశాన్య వీధి చూపు ఉంది అనగానే తొందరపడి తీసుకోకూడదు. సరిగ్గా విశ్లేషణ చేసుకోగలగాలి. తూర్పు ఈశాన్యం నుంచి తగలే వీధిచూపు ఏదైనా ఉంటే ఆ ఇంటి యజమానులందరికీ... అంటే ఇల్లు కట్టిన యజమానికి, ఆ ఇంట్లోకి అద్దెకు వచ్చిన కుటుంబ యజమానికి కూడా చాలా బాగుంటుంది. ఆ ఇంట్లో నివసించే వాళ్ళందరికి కూడా చక్కటి ఫలితాలను అనుభవంలోకి వస్తాయి. అందులో సందేహం లేదు. అయితే తూర్పు ఈశాన్యం వీధి చూపులో గొప్ప అనుకూల గుణాలు ఉన్నట్లే, కొన్ని ప్రతికూల గుణాలు కూడా ఉంటాయి. అందులో ముఖ్యమైన అనుకూల గుణం ఏమిటంటే– ఈశాన్యం వీధి చూపు తగిలిన ఇళ్లలో నివసించే వాళ్లకు ఎలాంటి బాధలు కష్టాలు కలిగిన్నప్పటికీ, వాళ్ళు చాలా సునాయాసంగా వాటిని అధిగమించ గలుగుతారు.

విద్య, ఆరోగ్యం, ఐశ్వర్యం, పరపతి.. ఇవన్నీ కూడా వాళ్లకి చాలా సులభంగా దొరుకుతూ ఉంటాయి. ఎంత డెవలప్ చేసుకోగలిగితే వీళ్ళు అంత డెవలప్ కాగలుగుతూ ఉంటారు. ముఖ్యమైన ప్రతికూల గుణం ఏమిటంటే– ఎప్పుడైనా ఒక స్థలానికిగానీ, గృహానికి కానీ, తూర్పు ఈశాన్యం నుండి ఒక వీధి చూపు (మంచి ఫలితాలను ఇచ్చేది) తగులుతున్నప్పుడు ఆ స్థలం కాని, గృహం కానీ ఈశాన్య లోపం లేనిది అయి ఉండాలి. ఆ స్థలానికి ఈశాన్య లోపం ఉన్నప్పుడు లేదా ఈశాన్య దోషం ఉన్నప్పుడు ఏ విధంగానూ మంచి ఫలితాలు దొరకవు. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

“ఈశాన్య దోషం”, “ఈశాన్య లోపం” అని రెండు మాటలు ఇక్కడ వివరించవలసి వస్తోంది. లోపం అంటే ఏమిటి? దోషం అంటే ఏమిటి? ఇవి తెలుసుకుందాం.

ఈశాన్య లోపం అంటే ఈశాన్యం లోపించి ఉండటం. ఆ మొత్తం స్థలానికి గానీ, ఇంటి నిర్మాణ క్రమంలో, ఈశాన్యం “మూల” తిరిగి ఉండటం, ఈశాన్యం తెగి ఉండటం, ఈశాన్యం తగ్గి ఉండటం. అంటే ఈశాన్యం మూల 90 డిగ్రీల కంటే “ఎక్కువ” ఉండటం... ఇవన్నీ కూడా ఈశాన్య లోపాల కిందకు వస్తాయి. ఇటువంటి లోపాలు ఉన్నప్పుడు, మంచి ఫలితాలను ఇచ్చే వీధి చూపు ఉన్నప్పటికి కూడా మంచి ఫలితాలు ఉండవు. పైగా చెడు ఫలితాలు సాంద్రత ఎక్కువ ఉండే అవకాశం సైతం ఉంటుంది.

ఇటువంటి లోపాలను సరి చేసుకోగలిగితే చాలా తక్కువ సమయంలో చెడు ఫలితాలు తగ్గి, మంచి ఫలితాలు అనుభవంలోకి వస్తూ ఉంటాయి. కాలం గడుస్తున్న కొద్దీ అద్భుతమైన ఫలితాలు పొంద గలుగుతారు. ఇది చాలా సులభమైన ప్రక్రియ.


**(మిగతా వచ్చే వారం..)**


వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం వాస్తువార్తలో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

పూర్తి పేరు : ......................................

పుట్టిన తేది : ......................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............

చిరునామా:..........................................

# వాస్తవికతకు నిలువెత్తు నిదర్శనం

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

భారతీయ సినీ వినీలాకాశంలో ధవ తారగా, సమాంతర సినిమాకు మార్గదర్శిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన సినీ నిర్మాత, దర్శకులు శ్యామ్ బెనెగల్ తుది శ్వాస విడవడంతో భారతీయ చలనచిత్ర పరిశ్రమ మూగబోయింది. భారత అత్యుత్తమ సినీ పురస్కారం దాదా సాహెబ్ పాల్కే అవార్డుతో పాటు 18 జాతీయ ఫిలిమ్ అవార్డులను పొందిన పద్మశ్రీ, పద్మ భూషణుడు శ్యామ్ బెనెగల్ వి.శాంతారామ్ జీవన సాఫల్య పురస్కారం కూడా స్వీకరించిన భరతమాత ముద్దుబిడ్డ శ్యామ్ బెనెగల్.

భారత చలన చిత్ర రంగానికి షబానా ఆజ్మీ, స్మితా పాటిల్, నసీరుద్దీన్ షా, ఓం పురి, అమ్రిష్‌పురి, అనంతనాగ్, సాధు మెహ్రా లాంటి ప్రముఖ నటులను పరిచయం చేసారు. బెనెగల్ తొలి నాలుగు సినిమాలైన అంకుర్, నిశాంత్, మంథన్, భూమిక సినిమాలు మమ్మో, సర్దార్ బేగమ్, జుబేదా లాంటి సినిమాలు తీసి జాతీయ ఫిలిమ్ అవార్డులను గెలుచుకున్నారు. హిందీ సినిమా రంగంలో ఏడు జాతీయ ఫిలిమ్ అవార్డులను పొందిన దర్శకత్వ ఘనుడిగా రికార్డులు సృష్టించారు. గుజరాతీ పాడి పరిశ్రమకు పునాది వేసిన కురియన్ ప్రేరణతో ఐదు లక్షల గుజరాతీ రైతులు ఒక్కొక్కరు రెండు రూపాయల విరాళం ఇవ్వగా సినీ నిర్మాతగా మారి 'మంథన్' సినిమాను 1976లో తీయగలిగారు. తను తీసిన సినిమాలు నేటి దర్శక నిర్మాతలకు పాఠాలుగా మారడం, జీవం ఉట్టిపడే విధంగా సినిమాలను నిర్మించడా ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అయ్యింది. 1980ల్లో కల్‌యుగ్, సుస్మన్, యాత్ర, మండీ, త్రికాల్, సర్దార్ బేగమ్, జుబైదా లాంటి సమాంతర సినిమాలతో పాటు భారత్ ఏక్ ఖోజ్ (టీవీ సీరియల్)లను తీసారు. సమాంతర చిత్రాలకు కొత్త నిర్వచనాన్ని ఇవ్వడం చూసాం. నిజ జీవితాలకు అద్దం పట్టే విధంగా, వాస్తవికతకు పట్టం కట్టే రీతిలో సరళమైన పద్ధతిలో తీయడం ఆయనకు మాత్రమే సొంతం.

**జననం, విద్యాభ్యాసం, సినీరంగ ప్రవేశం:** 14 డిసెంబర్ 1934న తిరుమలగిరి, హైదరాబాద్‌లో జన్మించారు. తన 12వ యేటనే తండ్రి ప్రోత్సాహంతో కెమెరా చేత పట్టిన ధీశాలి మన బెనెగల్. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎం ఏ పట్టాను పొందిన తర్వాత హైదరాబాదు ఫిలిమ్ సొసైటీ" స్థాపనకు చొరవ తీసుకున్నారు. 1959లో కాపీ రైటర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి 1962లో 'ఘేర్ బేతా గంగా' అనే తొలి డాక్యుమెంటరీ తీసిన శ్యామ్ తర్వాత వరుసగా డాక్యుమెంటరీలు/ప్రకటనల ఫిలిమ్‌లు తీయగలిగారు.

**సమాంతర సృజనశీల సినిమా పితామహుడు:** అంకుర్, నిశాంత్, మంథన్, భూమిక సినిమాలతో భారతీయ సినీ పరిశ్రమకు సృజనశీల సమాంతర సినిమా రుచిని చూపి విమర్శకుల మన్ననలు సహితం స్వంతం చేసుకున్నారు. అదే వరుసలో 1980 86 మధ్య నేషనల్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, 1985 మాస్కో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో న్యాయనిర్ణేతగా కూడా విశేష సేవలను అందించారు. 1990ల్లో తన సినీ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ సూరజ్ కా సత్వన్ ఘోడ్, ది మేకింగ్ ఆఫ్ మహాత్మా, ది అన్‌ఫర్గెటబుల్ హీరో, సమర్ లాంటి పలు సినిమాలు తీసారు. ఫెడరేషన్ ఆఫ్ ఫిలిం సొసైటీస్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా పని చేసిన బెనెగల్ సహయాద్రి ఫిలిమ్స్ ప్రొడక్షన్ కంపెనీని స్థాపించారు. తన స్వంత సినిమాల ఇతివృత్తాలతో మూడు పుస్తకాలను రచించారు. 2008 తర్వాత వెల్‌కమ్ టు సజ్జన్‌పూర్, చమ్కీ చమేలీ, వెల్ డన్ అబ్బా, సంవిధాన్ సినిమాలు తీసారు. బంగ్లాదేశ్ ప్రభుత్వ సౌజన్యంతో షేక్ ముజిబుర్ రహెమాన్ జీవిత చరిత్రను "ముజిబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్" సినిమాను తీసి 2023లో విడుదల చేసారు.

**ఎన్నెన్నో సినీ పురస్కారాలు:** శ్యామ్ బెనెగల్ ప్రతిభను మెచ్చి అసంఖ్యాక అవార్డులు ఆయన చెంతనే చేరి మురిసి పోయాయి. దాదా సాహెబ్ పాల్కే అవార్డుతో పాటు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ చిత్రం, నర్గీస్ దత్ అవార్డు, కేన్స్ ఫిలిం ఫెస్టివల్ నామినేషన్, బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ నామినేషన్, మాస్కో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ గోల్డెన్ ప్రైజ్, బి ఎన్ రెడ్డి నేషనల్ అవార్డు, జీవన సాఫల్య పురస్కారం, హోమీ బాబా ఫెలోషిప్, పద్మశ్రీ, పద్మ భూషణ్, సోవియట్‌ల్యాండ్ నెహ్రూ అవార్డు, ఏఎన్ఆర్ నేషనల్ అవార్డు, గుజరాత్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ లాంటి పలు పురస్కారాలు లేదా గుర్తింపులు పొందారు. ఉత్తమ చారిత్రక, జీవిత చరిత్రలకు సంబంధించిన సినిమాలకు అవార్డులు పొందారు.

నీరా బెనెగల్‌ను వివాహమాడిన



శ్యామ్ బెనెగల్‌కు పాయ్ బెనెగల్ కూతురు ఉన్నది. తన 90వ యేట మూత్రపిండాల దీర్ఘకాలిక సమస్యతో 23 డిసెంబర్ 2024న తుది శ్వాస విడిచిన బెనెగల్ భారతీయ సినీ పరిశ్రమకు అంతర్జాతీయ కీర్తిని ఆర్జించి పెట్టారు. మహామహుల జీవిత చరిత్రలు, సమాంతర సినిమా దర్శక నిర్మాత, ఫిలిం సొసైటీ ఉద్యమ ప్రారంభకులు, ఫిలిం ఇనిస్టిట్యూట్ బోధనలు, ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ న్యాయ నిర్ణేత, సామాజిక చైతన్యం తీసుకు వచ్చిన సినిమాల నిర్మాణం, చిన్న సినిమాలతో పెద్ద పేరు తెచ్చుకున్న ఘనుడు మన శ్యామ్ బెనెగల్ తన 90వ యేట కన్ను మూయడంతో భారతీయ సినీ రంగం కన్నీరు పెడుతున్నది. సమాంతర సినిమా పితామహుడిగా పేరు తెచ్చుకున్న మన హైదరాబాదీ ముద్దు బిడ్డ ఆత్మ శాంతించాలని కోరుకుందాం, బెనెగల్ సినీ నిర్మాణ విలక్షణ, సృజనశీల దక్షతకు పాదాభివందనం చేద్దాం. ■

**ఆది దేవ నమస్తుభ్యం**
**ప్రసీద మమ భాస్కరః**
**ప్రభాకర నమస్తుభ్యం**
**దివాకర నమోస్తుతే!**

అంటూ అరవై సంవత్సరాల రాజు సూర్యాష్టకం చదువుతూ తడి అర్ఘ్య ప్రదానం చేస్తున్నాడు ఓ ఉదయం పూట ఇంట్లోదీపం వెలిగిస్తూ.

"ఓం దీపం జ్యోతి పరబ్రహ్మం

# నడిచే ఏటీయం

దీపం కురుతమోపహం
దీపేనా సాధ్యతే సర్వం
సంధ్యాదీపం నమోస్తుతే"

అంటూ దేవుని ఫోటోలకు హారతి ఇస్తోంది రాజు భార్య లక్ష్మి..!! "భుక్తి పరమేశ్వర నిర్మితం" అని నమ్మే గొప్ప ఇల్లాలు, సహధర్మచారిణి.

రాజు ఓ ఫ్యాక్టరీలో నలభై సం॥ శ్రమించి ఉద్యోగ విరమణ చేసి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్నాడు.

బిస్కెట్ ఫ్యాక్టరీలో సూపర్ వైజర్‌గా అరవై సం॥ వయస్సులోనూ శ్రమిస్తోంది రాజు భార్య లక్ష్మి. కొడుకుకు మంచి ఉద్యోగం లభిస్తే వారి బాధలు తీరతాయనే గంపెడాశతో తాము తినీ-తినక.. కడుపు మాడ్చుకొని.. ఉన్న ఒక్క కొడుకును చెన్నైలో చదివించారు.

ఇంజనీరింగ్ పాసై, పెద్ద ఐటీ కంపెనీలో లక్ష్మి-రాజుల కొడుకు లక్షల జీతంతో కొలువుకు కుదిరాడు.

తాము పడ్డ కష్టాలు తమ కొడుకు కిషోర్ పడకూడదని చిట్టీలు వేస్తూ, అప్పులు చేయకుండా ఇల్లు, కారు, కిషోర్‌కు చిన్న వయసులోనే ఇల్లాలిని ఏర్పాటు చేసారు రాజు, లక్ష్మిలు.

"నాకు, ఈ అమ్మాయి నచ్చింది" అనగానే ముందు వెనకలు చూడకుండా 'పావని' తో కిశోర్ పెళ్లి చేసారు.

"కాలు తొక్కినప్పుడే కాపురం చేసే కళ తెలుస్తుంది" అనే ప్రాచీన నానుడి ఆ వృద్ధ దంపతులకు కొన్ని రోజుల్లోనే తెలియవచ్చింది.

"నా మొగుడు- నా ఇష్టం నా సంస్కారం" అంటూ పదహారు రోజుల పండగలోపే వేరు కాపురం పెట్టించింది కోడలు పావని.

"పిల్లల నుండి ఏం ఆశించరాదు" అనే ధోరణి రాజుది.

"నాన్నా, నాకు జీతం పెరిగింది. టాక్స్ లు పోతాయి. అందుకోసం నేను పైన ఫ్లోర్ వేస్తాను. ఇది వేరు కాపురం కాదు. కింద ఫ్లోర్‌లో మీరు, పైన మేం ఉంటాం. మిమ్మల్ని చూసుకొంటాను" అని చెప్పాడు కిషోర్.

పెళ్లికి ముందు పదివేలు ఇచ్చి తాను పదిహేను వేలు వుంచుకొని పై చదువులు చదివి పెళ్లినాటికి లక్షల శాలరీకి చేరాడు. తమను ఆదుకొంటాడనీ, తమకు విశ్రాంతి లభించి సుఖపడతాం అని భావించారు రాజు-లక్ష్మి దంపతులు. అందువల్ల భిన్న వాతావరణం ఆ ఇంట కొలువైంది.

కార్పొరేట్ హాస్పిటల్స్ కు, స్టార్ హోటల్స్ కు, గోవా బీచ్‌లకు, చెన్నై, బెంగళూరు టూర్స్, హై ఫై డ్రెస్‌లు, గిఫ్ట్‌లు, లగ్జరీ కారు కొనడం, పాత కారు అమ్మి పది లక్షల కారు కొనడం.. విపరీతంగా ఖర్చులు పెట్టడం, పెట్టించడం, తన మాటే వినాలి, భర్త తన చెప్పుచేతల్లో ఉండాలి, లగ్జరీగా జీవించాలి.. అనే పాశ్చాత్య ధోరణులు వంట పట్టించుకొని సుఖమయ జీవనం కోరె స్త్రీ పావని.

అరవై సంవత్సరాల పెద్దల్ని ఆదుకోవాలి అనే కనీస నైతిక స్పృహ లేకుండా శ్రీమతి కొంగుచాటుకు చేరాడు పాతికేళ్ల కిషోర్.

**తంగిరాల చక్రవర్తి**

**సింగిల్ పేజీ కథ**

కొడుకు తీరు, అధిక ఖర్చులపై గొల్లుమన్నాడు రాజు ఓ తండ్రిగా.

"ఒక వ్యక్తిని అంచనా వేయాలంటే పదవి ఇచ్చి చూడు", "కొడుకు గొప్పదనం చూడాలంటే పెళ్లి తర్వాత చూడు.. అనే పెద్దల మాటలు లక్ష్మి -రాజులకు తెలిసి వచ్చాయి.

లక్షల రూపాయల వేతనం వచ్చినా కొడుకు ఓ వంద రూపాయలు ఇచ్చే స్థితి లేని ఖర్చులు ప్రతిరోజూ పెట్టించి, నలభై రోజుల్లో నలభై లక్షల అప్పులోకి కిషోర్‌ని నెట్టింది పావని.

"తాము బిడ్డను కన్నాం కానీ అతని రాత కనలేదు" అతనిపై ఆధారపడొద్దు" అంది లక్ష్మి.

బాల్యం నుండి భగవాన్ రమణ మహర్షిని, జిడ్డు కృష్ణమూర్తిని, సనాతన ధర్మాన్ని రక్తంలో, సిరల్లో నింపుకొన్న లక్ష్మి అరవై సంవత్సరాల వయసులో భర్తకు భోజనం రెడీ చేసి తాను ఎప్పటిలాగే ఫ్యాక్టరీ పనికి బయలు దేరింది.

హార్ట్ ఆపరేషన్, బిపి, షుగర్, కంటి జబ్బులతో మంచానికే పరిమితమై భార్య సంపాదనపై ఆధారపడి జరుగుతున్న పరిస్థితులను చూసి బాగా కుంగిపోయాడు రాజు.



కోడలితో నిత్యం ఘర్షణ పడసాగాడు రాజు.

'పెళ్లాం బెల్లం' కదా కిషోర్ మౌనమునియై అప్పుల వాళ్లను సముదాయిస్తూ కాలం వెళ్లదీయసాగాడు.

ఇరుగు-పొరుగువారు భార్యకు దాసుడైన కిషోర్‌ను నడిచే ఏటిఎం అనసాగారు.

# భవితకు బాటలు వేయాలి!


డా॥ ఎన్.బి.సుధాకర్ రెడ్డి

తిరుపతి నుంచి విశాఖపట్నం వెళ్లడానికి ఫ్లైట్ ఎక్కాను. నా పక్క సీట్లో ముప్పై ఏళ్ల యువకుడు కూర్చున్నాడు. అతనితో మాటలు కలిపాను. అతను ఒక బహుళ జాతీయ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. రెండు లక్షలకు పైగా జీతం వస్తోంది. బి.టెక్, ఎం.బి.ఏ. తరువాత పార్ట్ టైం పి.హెచ్‌డి. చేస్తున్నాడు. పెళ్లయింది. భార్య బి.టెక్ చదివినా ఇప్పటివరకు ఉద్యోగం రాలేదు. దీంతో తనకు వచ్చే రెండు లక్షల జీతంతో ఇద్దరు బతకలేరా? అంటూ ప్రశ్నించాను. దానికి సమాధానంగా అతడు చెప్పిన విషయాలు విని ఖంగుతిన్నాను.



ఉద్యోగం వచ్చిన తరువాత రెండు కోట్ల విలువ చేసే విల్లా కొన్నాడు, నలభై లక్షల విలువ చేసే కారు కొన్నాడు. యాభై లక్షలు పెట్టి ఇంట్లోకి ఫర్నిచర్ కొన్నాడు. పెళ్లికి దాదాపు డెబ్బై లక్షలు ఖర్చు అయింది. ఇవన్నీ బ్యాంకుల్లో అప్పు చేసి సమకూర్చుకున్నాడు. వచ్చే జీతంలో తొంభై శాతం బ్యాంకు ఇఎంఐలు, ప్రైవేటు వ్యక్తుల వద్ద తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టడానికి సరిపోతోంది. తల్లిదండ్రులకు నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో వచ్చే ఆదాయం వారి ఖర్చులకే సరిపోవడం లేదు. తన అప్పులు పూర్తిగా తీరడానికి ఇరవై యేళ్ల సమయం పడుతుందని చెప్పాడు. అందుకే ఇప్పుడే పిల్లలు వద్దనుకుని జాగ్రత్త పడుతున్నామని చెప్పాడు. ఇంత చదువుకుని మంచి ఉద్యోగం చేస్తున్న అతను ఆర్భాటాలకు పోయి ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాడు..

మరోసారి.. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లడానికి రైలు ఎక్కి సెకండ్ క్లాస్ ఎ.సి. బోగీలో కూర్చున్నాను. సీనియర్ సిటిజన్‌ను కాబట్టి లోయర్ బర్త్ కేటాయించారు. రైలు కదిలే సమయంలో ఒక అమ్మాయి గబగబా రైలు ఎక్కి ఆయాసపడుతూ వచ్చి నా పక్కన కూర్చుంది. కొద్దిసేపటి తరువాత తనకు అప్పర్ బెర్త్‌ని ఇచ్చారనీ, పైకి ఎక్కడం కొంత కష్టంగా ఉంటుంది. కనుక నా బెర్త్ ఇమ్మని కోరింది. నవ్వుతూ సరేనన్నాను. ఆమె లావుపొట్ట చూసి గర్భవతి అనుకున్నాను. నెమ్మగా మాటలు కలిపి వివరాలు తెలుసుకున్నాను. ఆమె వయస్సు ఇరవై యేళ్లు, ఎనభై కిలోల బరువు



ఉంది. ఇంకా పెళ్లి కాలేదు. పి.సి.ఓడి వల్ల అధిక బరువు ఉన్నట్టు తెలిపించది. దీనివల్ల పెళ్లి సంబంధాలు తప్పిపోతున్నాయని బాధపడింది. ఆమె బి.టెక్. తరువాత హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. తిరుపతి సమీపంలో ఒక పల్లెటూరు. జీతం లక్షా ఇరవై అయిదు వేలు వస్తోంది. అయినా శారీరక సమస్యల వల్ల పెళ్లి కాలేదు. రైల్లో కనీసం అప్పర్ బెర్త్ ఎక్కలేకపోతోంది.

కీర్తనతన పదేళ్ల క్రితం పెద్దలను ఎదిరించి ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఆమె, ఆమె భర్త ఇద్దరూ డిగ్రీ వరకు చదువుకున్నారు. ఆమె ఒక షాపులో అకౌంటెంటెగా, అతను ఒక ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్‌గా చేరారు. వచ్చే జీతం పొదుపుగా ఖర్చు చేసుకుంటూ కొంత కూడబెట్టారు. పెళ్లయిన రెండేళ్లకు పుట్టిన పాపను ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నారు. ఏడాది నుంచి ఆమె భర్త గంజాయి, ముందుకు బానిస అయ్యాడు. సంపాదన చాలక అప్పులు చేయడం అలవాటు చేసుకున్నాడు. తాగి ఇంటికి వచ్చి భార్యతో వాదన పెట్టుకుని బెల్ట్‌తో కొడుతున్నాడు. ఇప్పుడు ఆమె పరిస్థితి దయనీయంగా ఉంది. భర్తను కాదనుకుని వెళ్తే తల్లిదండ్రులు ఆదరించే స్థితిలో లేరు. ఆత్మహత్య చేసుకుంటే ఐదేళ్ల పాప దిక్కులేనిదవుతుంది. రాత్రంతా భర్త వద్ద దెబ్బలు తిని నిద్ర లేకపోవడంతో పగలు ఆఫీసులో సక్రమంగా పని చేయలేకపోతోంది. దీనితో యజమాని దగ్గర తిట్లు తినక తప్పడం లేదు. ఈ పరిస్థితుల వల్ల మానసిక ఒత్తిడికి గురై డిప్రెషన్‌లోకి జారుకుంటోంది. 27 యేళ్ల వయసుకే 47 యేళ్ల మహిళలా తయారైంది. భర్తను మార్చుకోలేక, ఒత్తిళ్లను తట్టుకోలేక సతమతమవుతోంది.

## యువత కీలకం

సమాజంలో యువత పాత్ర కీలకం. జాతి నిర్మాణం, దేశ అభివృద్ధిలో యువశక్తి పాత్ర ప్రధానం. ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయడంలో యువతీ యువకుల కృషి చాలా అవసరం. వ్యవస్థలో వేళ్లూనుకున్న లోపాలను సరిదిద్దగల సామర్థ్యం ఎక్కువగా యువశక్తిలో దాగి వుంది. సమాజంలో సానుకూల మార్పుకు శ్రీకారం చుట్టి ఆర్థిక, సాంకేతిక, ఆరోగ్య పురోభివృద్ధి సాధించడంలో యువత క్రియాశీల పాత్ర పోషించాలి. అందుకే స్వామి వివేకానంద ఎక్కువగా యువతను ప్రభావితం చేయడంపై దృష్టి కేంద్రీకరించారు. నా విశ్వాసం యువతరం ఆధునిక తరం, ఇనుప కండరాలు ఉక్కు నరాలు కల యువత కావాలి అనేవారు స్వామి.

అన్ని దేశాల కంటే భారతదేశంలో యువత శాతం ఎక్కువ. యువశక్తిని పటిష్టపరచడం ద్వారా ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలుపవచ్చని మేధావులు భావిస్తున్నారు. అయితే మన దేశంలో అనేక సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదు. పేదరికం, నిరుద్యోగం ఇప్పటికీ సమస్యగానే ఉంది. 1857లో మన దేశంలో సిపాయిల తిరుగుబాటు జరిగిన సమయంలో మన రూపాయి విలువ రెండు డాలర్లకు సమానం. 1947లో మనకు స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో డాలరు, రూపాయి సమాన విలువ కలిగి వున్నాయి. ఇప్పుడు ఒక డాలరు కోసం మనం 84.95 రూపాయలు చెల్లించవలసిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో భారతీయ యువత, విద్యావంతులు డాలర్ల సంపాదన కోసం విదేశాలకు పరుగులు తీస్తున్నారు. అలాగే అక్కడి ఉద్యోగాలకు అనుగుణంగా నైపుణ్యాలు నేర్చుకుంటున్నారు. ఒకప్పుడు ప్రపంచానికి నాగరికత నేర్పిన భారతదేశంలో పుట్టిన యువతలో కొందరు పాశ్చాత్య వేష భాషల పట్ల మక్కువ పెంచుకుంటున్నారు. సమగ్ర వ్యక్తిత్వం, పరిపూర్ణ ఆరోగ్యం ఉన్న యువతీ యువకుల సంఖ్య తగ్గిపోతోంది. మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు కొందరు యువకులు వృద్ధుల్లా కనిపిస్తున్నారు. శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొనేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. భారతీయ యువతలో మానసిక ఒత్తిళ్లు, డిప్రెషన్, ఆత్మహత్యలు సమస్యగా పరిణమిస్తున్నాయి. దాదాపు ఐదు శాతం మంది తీవ్రమైన మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు. స్థూలకాయం, గుండెసమస్యలు, వ్యసనాలు, రక్తపోటు, సంతాన సాఫల్యలేమి, అకాల మరణాల శాతం పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం.. గాడి తప్పుతున్న జీవనశైలి. విద్యార్థులు, యువకులు ర్యాంకుల సాధన, డాలర్ల ఆర్జన, ఫ్యాషన్ల మాయలో పడి జీవన సాఫల్యతను దెబ్బ తీసుకుంటున్నారు. నిద్రలేమి, శారీరక శ్రమ లేకపోవడం, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, మాదక ద్రవ్యాలకు బానిసలు కావడం వల్ల కొందరు శారీరక, మానసిక సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. సంపాదనే ధ్యేయంగా భావించిన కొందరు సంసారాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. వేదభూమిగా చెప్పుకునే భారతీయ సమాజంలో కుటుంబ వ్యవస్థ, దాంపత్య జీవితాలు పగుళ్లు బారుతున్నాయి. మహాభారతంలో అభిమన్యుడు వంశగౌరవం కోసం పద్మవ్యూహంలో ప్రవేశించి అసువులు బాసారు. ఇప్పటి యువతీ యువకులు కొందరు జీవన సమరంలో బయటికి రాలేక ఆరోగ్యం దెబ్బతిని గుండెపోట్లకు గురవుతున్నారు. రామాయణంలో సీతారాములు ప్రేమ స్వరూపులుగా నిలిచారు. ఆ వారసత్వాన్ని పంచుకుని పుట్టిన కొందరు యువత రాక్షసులుగా మారి ప్రేమ పేరుతో గొంతులు కోస్తున్నారు. కొందరిలో మొగ్గ తొడిగే అపరిపక్వ ప్రేమలు సమాజానికి సమస్యగా మారుతోంది. ఈ పరిస్థితులలో సామాజిక వ్యవస్థలు కళ్లు తెరవాలి. యువశక్తి మేల్కొనాలి. గమ్యం వైపు సాగిపోవాలి. సమాజాన్ని చైతన్యపరచాలి. అందుకు ఎవరికి వారు స్వీయ నిర్మాణం కోసం నడుం బిగించాలి.



## లక్ష్యం శ్వాసగా మారాలి

యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి. లక్ష్యమే శ్వాస, లక్ష్యంపై ధ్యాస అన్నట్టుగా ఎదగాలి. అందివచ్చిన శాస్త్ర, సాంకేతిక ప్రగతిని హస్తగతం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. అందుకు తగిన శారీరక సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంచుకోవాలి. మానసిక శక్తి యుక్తులను పెంపొందించుకోవాలి. అనవసర ఆలోచనల వల్ల కలిగే గందరగోళం వీడి గమ్యం వైపు సాగాలి. ఎవరికి వారు స్వీయ నిర్మాణం పట్ల శ్రద్ధ చూపించాలి. చరిత్రలో తమకంటూ ఒక పేజీ ఉండేలా కృషి చేయాలి. తమ జీవిత గాథకు రచన, దర్శకత్వం, నటన, పాటలు, ఆటలు, కాస్ట్యూమ్స్, సంగీతం అన్నీ తామేనని గుర్తించాలి. అంటే సమగ్రమైన వ్యక్తులుగా తమను తాము నిర్మాణం చేసుకోవాలి. అనుభవాలకు అనుగుణంగా పరిపక్వత సాధించి మార్పుకు శ్రీకారం చుట్టాలి. సానుకూల దృక్పథం, సత్ప్రవర్తన, సమాచార నైపుణ్యం, నక్రమశిక్షణ జీవనంలో భాగం కావాలి. ఉద్వేగాలను నియంత్రించుకుని లక్ష్యంవైపు సాగిపోవాలి. తగిన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనపైనే దృష్టి పెట్టాలి.మంచి అలవాట్లు, ఉత్తమ అభిరుచులు అలవరచుకోవాలి. సామాజిక, కుటుంబ స్నేహ సంబంధాలు పెంపొందించుకోవాలి. జ్ఞానం, వికాసం, నాయకత్వ లక్షణాలను స్వంతం చేసుకోవాలి.

ఆచారాలు, నైతిక విలువలు, సామాజిక ధర్మాలు, చట్టబద్ధ వ్యవహారాలు రక్షణ కవచాలుగా మారతాయి. అత్యాశ, ఈర్ష్య, ద్వేషం, పగ, ప్రతీకారం, అడ్డదారులు తొక్కడం లాంటి మానసిక ప్రవృత్తి జీవితాన్ని నరకప్రాయంగా మారుస్తుంది. వ్యసనాల బారిన పడినవారు జీవచ్ఛవాలుగా మారుతారు. అపరిపక్వ ప్రేమలు అనర్థాలకు దారి తీస్తాయి. అందుకే గతం నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి. బద్ధకం, నిర్లక్ష్యం, వాయిదాల మనస్తత్వం లక్ష్య సాధనకు అవరోధాలుగా పరిణమిస్తాయి. కాబట్టి ఎదగాలనుకునే యువత జ్ఞానం, చైతన్యం, సామర్థ్యం, చురుకుదనం మూల స్తంభాలుగా మార్చుకోవాలి. కేవలం సంపాదన కోసం బతకడం మాని, తాను బతుకుతూ తన చుట్టూ వున్నవారిని బతికించాలన్న విశాల దృక్పథంతో ముందుకు సాగాలి. ఎవరికి వారు తమ బలాలు, బలహీనతలను గుర్తించి, అవరోధాలు అధిగమించి అవకాశాలను అందిపుచ్చుకోవాలి. సహజంగా సమాజంలో ప్రతివారు కొత్త సంవత్సరం కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకుంటారు. వాటి సాధన కోసం కొన్ని తీర్మానాలు చేసుకుంటారు. ఈసారి యువత సమగ్ర వికాసం, సమున్నత లక్ష్యసాధన కోసం సంకల్పం తీసుకోవాలి. శారీరక, మానసిక, సామాజిక సమతుల్యత వైపు పయనించాలి. యువత జాతి భవిత కోసం నడుం బిగించాలి.

## జనవరి 5, 2025 నుండి జనవరి 11, 2025 వరకు

# వారఫలం




శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1

ఫోన్ : 98494 53449, 9440927795




## మేషం

ఈ వారం కొంతమందికి మీ సలహాలు, సూచనలు ఇచ్చి వాళ్ళ ద్వారా పనులు చేయించు కోవాలన్న ఆలోచనలు ముడిబడతాయి. మీకు ఉన్న ధైర్యం స్ఫూర్తి మీ వాళ్ళకి లేదు అని బాధపడాలో లేదా వలందరి బలమే మీరు అని సంతోష పడాలో అర్థంకాదు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. ముఖ్యమైన విషయమై దీర్ఘాలోచనలు చేస్తారు. గురువుల ద్వారా ధైర్యాన్ని, మంచి సలహాలను, స్వీకరించ గలుగుతారు.



## వృషభం

ఈ వారం ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. పూజలలో ప్రథమతాంబూలాన్ని వాడండి. ఆర్థిక ప్రయోజనాలు పొందుతారు. కళలు, రాజకీయ, రంగాలలోని వారికి మంచి అవకాశాలు లభిస్తాయి. భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. వివాహాది శుభకార్యాలు సానుకూల పడతాయి. రహస్య సమాచారము కీలకమైన వ్యక్తుల గురించి అసలు విషయాలను తెలుసుకో గలుగుతారు. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి . బ్యాంకు ఉద్యోగస్తులకు బాగుంటుంది.



## మిథునం

ఈ వారం కీలకమని భావించి విషయాలలో తొందరపాటు తగదు, జాగ్రత్త వహించండి. సెంటిమెంట్ వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు అవసరం. ముఖ్యమైన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. పూజలలో, శుభకార్యాలలో సుగంధసిద్ధ గంధాక్షింతలను ఉపయోగించండి. గృహం, వాహన అమ్మకాలు, కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. అన్ని రకాల వ్యాపారస్తులకి అనుకూల ఫలితాలు గోచరిస్తున్నాయి.వృత్తిరీత్యా మంచి ప్రోత్సాహాన్ని అందుకో గలుగుతారు.



## కర్కాటకం

ఈ వారం మీ శ్రమకు, మీ కష్టానికి ప్రతిఫలాలను అందుకోగలుగుతారు. రాజకీయ పైరవీలు లాభిస్తాయి. వాక్చాతుర్యంతో ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లో నుండైనా బయటపడగలుగుతారు. మేనేజ్‌మెంట్‌లో ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంది. సేల్స్ డిపార్టుమెంట్‌లో ఉన్నవారికి అనుకూలంగా ఉంది. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి త్రిశూల్ పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. వ్యాపారాలలో ఆదాయం రొటేషన్‌ల రూపంలో ఉంటుంది. విహార యాత్రలు పుణ్యక్షేత్రాల సందర్శన చేసుకుంటారు.



## సింహం

ఈ వారం కార్యాలయంలో కొంతమంది చేస్తున్న కుట్రలు కుతంత్రాలను బయటకి పడవేయాలని మీరు చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. సాక్ష్యాధారాలతో మీరు రుజువులను నిరూపించ గలుగుతారు. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. వాహనాన్ని అమ్మి కొత్తది కొనుగోలు చేయాలన్న ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. దీనికి తగిన వ్యక్తులను ఎంచుకుంటారు. వారికి సమాచారాన్ని అందజేస్తారు. దైవదర్శనాలు చేసుకోగలుగుతారు.



## కన్య

ఈ వారం పట్టుదల క్రమశిక్షణతో సాధించలేనిది అంటూ ఏమీ లేదు, దేవుడి మీద భారం వేసి ముందడుగు వేస్తారు. మీ ఓర్పు, సహనంతో ఎన్నో విజయాలను సాధిస్తారు. దైవ చింతన కలిగి ఉంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. కుక్కలకు జీవరాసులకు మంచినీళ్ల పెట్టండి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి అర్చన జరిపించండి. పెద్దల పేరు మీద స్వయంపాకం ఇవ్వండి. ఏ నూతన కార్యక్రమాన్ని అయినా ప్రారంభించండి.పితృదేవతల అనుగ్రహంతో కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి అవుతాయి.



## తుల

ఈ వారం అనుకున్న కార్యక్రమాలలో అంతంతవు మాత్రపు పురోగతిని సాధిస్తారు. ఆలోచన విధానం అనుకూలంగా ఉంటుంది. నూతన వ్యాపార రీత్యా తీసుకునే ఆలోచనలు చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. అష్టమూలిక తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి. విదేశాలలో ఉన్నవారికి అంతంత మాత్రమే ఫలితాలు అందుతాయి. భూ సంబంధిత లావాదేవీలు అనుకూలిస్తాయి. మంత్ర ఉపదేశం తీసుకోవాలన్న ఆలోచనలు కలుగుతాయి.



## వృశ్చికం

ఈ వారం దీర్ఘాలోచన ద్వారా మంచి ఫలితాలు అందకపోవచ్చు తొందరగా తీసుకొని ఆలోచనలతో ప్రయోజనాలని దక్కించుకుంటారు. రుణ బాధల నుండి బయట పడడానికి కాను చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. స్వార్థితంతో కొన్ని సేవా కార్యక్రమాలకు విరాళాలు అందజేస్తారు. కళా సాంస్కృతిక రంగాల్లో ఉన్నవారికి మంచి అవకాశాలు అందుతాయి.



## ధనస్సు

ఈ వారం టీవీ పరిశ్రమల్లో ఉన్నవారికి సినీ పరిశ్రమల్లో ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంటుంది.నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. సుదీర్ఘమైన చర్చలు, ఫోన్ సంభాషణ ద్వారా విలువైన సమాచారాన్ని గ్రహిస్తారు. ఓం నమశ్శివాయ వత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. శత్రువుల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. రక్త సంబంధాలు అతీతంగా వ్యవహరిస్తారు తప్పుని తీవ్రంగా ఖండిస్తారు.



## మకరం

ఈ వారం కోపతాపాలకు దూరంగా ఉండండి. జీవిత భాగస్వామితో సఖ్యత కలిగి ఉంటారు. అన్ని విషయాల గురించి అవగాహన పెంచుకునే ప్రయత్నాలు కలిసి వస్తాయి. నూతన పెట్టుబడులు నూతన ప్రయత్నాలు అంతంత మాత్రమే ఉంటాయి. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి. పాల వ్యాపారస్తులకి నేల వ్యాపారస్తులకి చిన్న పొన్న వ్యాపారస్తులకి కాలం అనుకూలంగా ఉంటుంది. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాలను ప్రారంభిస్తారు.



## కుంభం

ఈ వారం నూతన ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. వివాహాది విషయ వ్యవహారాలు ముడిబడతాయి. నూతన గృహోపకరణాలను కొనుగోలు చేస్తారు. వైద్యుణ్ని మార్చాలన్న ఆలోచనలు ఏర్పడతాయి. శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరం తో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. శనీశ్వరాలయంలో తైలాభిషేకం జరిపించండి నలుపు వత్తులతో నువ్వుల నూనెతో దీపారాధన చేయండి. వాహన విషయంలో, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదు.




## మీనం

ఈ వారం కోర్టు వ్యవహారాది తీర్పులు మిశ్రమంగా ఉంటాయి. ప్రయోజనాలు దక్కుతాయో లేదో అన్న ఆందోళన కలిగి ఉంటారు. కొన్ని సందర్భాలలో నిజాలు మాట్లాడుకో లేని పరిస్థితులు నెలకొంటాయి. మహా పాశుపత కంకణం ధరించండి. ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. నూతన వ్యాపారం కోసం చేసే ప్రయత్నాలు ప్రయోజనకరంగా మారుతాయి. ఉన్న వ్యాపారాన్ని విస్తరణ కోసం చేసే ప్రయత్నాలు కూడా అనుకూలిస్తాయి.

# ఈ వారం కా'ర్టూన్స్'


కొన్ని కొత్త సం॥రం తీర్మానాలు రాసుకున్న..
నిన్ను చూసి ఓకే చేస్తే.. ఫేస్బుక్కులో పెట్టుకుంటా!!


పేరయ్యగారూ.. జీవితాంతం నైటీల్లోనేగా చూసేది!
అందుకే నైటీల్లో ఉన్న అమ్మాయిల ఫోటోలే చూపించండి!!


...అలా ఎప్పుడు పడితే అప్పుడు 'పీలింగ్స్'
రాకుండా ఎందుకు ఉంటాయి సారూ..!!
DOCTOR



పక్షుల గూళ్లు కూడా ఓ వింతేనా.. అని ఆశ్చర్యపోకండి. థాయ్‌లాండ్‌లోని పట్టాయాలో వున్న ఓ రెస్టారెంట్‌కు సంబంధించిన చిత్రాలివి. వీటిని పర్యాటకుల కోసం వినూత్నంగా ఏర్పాటు చేసారు. పక్షి గూళ్లలో ఆసీనులై విందారగిస్తూ ప్రకృతిని ఆస్వాదించాలంటే ముందుగానే రిజర్వ్ చేసుకోవాలి మరి.







